



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 310 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 16 జూలై 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :310 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 16 JULY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి

- ఏపీలో రాబోయే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం
- సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచన

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ లక్ష్యాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, జీసీసీలు, డేటా సెంటర్ల స్థాపనకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించగా, ఈ సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు. ఇటీవలి బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని, వీటి ద్వారానే యువతకు 35,000 ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎంఓయూలు చేసుకున్న



సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్‌లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

**త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం**

రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీంతో పాటు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌ల సేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం

వివరాలు 2లో..

## సీమకు జలసిరులు... రేపు నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

- హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపు
- శరవేగంగా పనులు పూర్తి
- 100 రోజుల్లోనే కాలువ విస్తరణ



**పెన్ పవర్ డెస్క్:**హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపుతో రాయలసీమలో తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన నిర్ణయాలు, చూపిన చొరవ ఫలితంగా రాయలసీమకు జలసిరులు అందనున్నాయి. హంద్రీనీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు విజయవంతంగా పూర్తి కావడంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం అయ్యేందుకు మార్గం సుగమం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వంద రోజుల్లోనే ఈ కాలువ విస్తరణ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసింది.

**పరుగులు తీసిన ప్రాజెక్టు పనులు**

రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు తాగు, సాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్-1, ఫేజ్-2 కాలువ పనులను పరుగులు పెట్టించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి

వివరాలు 2లో..

## మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

- ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డికి ఎదురుదెబ్బ
- ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు
- సిట్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో మిథున్ రెడ్డి ఏ4గా ఉన్నారు.

వివరాలు 2లో..

## బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్

- పెద్దారెడ్డి పాదయాత్రలో జేసీపై సిద్ధార్థ రెడ్డి విమర్శలు
- నీలాంటి బచ్చా లీడర్లు చాలా మంది వచ్చిపోయారన్న జేసీ
- రాత్రిపూట కన్ను ఎగరేస్తే ఎలా ఉంటుందో నీకు తెలుస్తుందని వార్నింగ్



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాదయాత్ర సందర్భంగా పెద్ద పప్పూరులో జేసీ ప్రభాకర్ రెడ్డిని ఉద్దేశించి సిద్ధార్థ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మాకైతే తెలియదు.. మీకు తెలుసా?

- వీరసావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పిటిషన్
- తన పిటిషన్ రాహుల్ గాంధీ చదివేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరిన పిటిషనర్
- రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు పెట్టేందుకు న్యాయపరమైన అవకాశం ఉందన్న హైకోర్టు



**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని మాకు తెలియదు, మీకేమైనా తెలుసా? అని పిటిషనర్‌ను బాంబే హైకోర్టు ప్రశ్నించింది. వీర సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ గాంధీ తన పిటిషన్ కాపీని చదవాలనే ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ బాంబై హైకోర్టును కోరారు.

వివరాలు 2లో..

## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

- ఇటీవల ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ కాల్ సంభాషణ
- ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పుతిన్!
- అనంతరం జెలెన్ స్కీతో ట్రంప్ కీలక చర్చలు!

**పెన్ పవర్ డెస్క్:**ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్... ఇకపై రష్యాను ఒత్తిడి లోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి.

వివరాలు 2లో..




### జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

## భూసేకరణను అడ్డుకోవాలని వినతి

- కరేడు భూముల్లో సోలార్ పరిశ్రమ
- ఇటీవలే భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు



**పెన్ పవర్ డెస్క్:**నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తమ సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు మంగళవారం నాడు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను కలిశారు. సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రం అందజేశారు.రైతుల సమస్యలను సావధానంగా విన్న జగన్, అన్నదాతలకు వైసీపీ ఎప్పుడూ

వివరాలు 2లో..

## ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం... హాజరైన టీడీపీ నాయకులు

- ఎన్నికల విధానాల్లో సంస్కరణ, ఓటరు జాబితాల్లో సంస్కరణలపై చర్చ
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన ఈసీ
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్న టీడీపీ బృందం

**పెన్ పవర్ డెస్క్:**సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానాల్లో సంస్కరణలు,

వివరాలు 2లో..




## మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

- రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు
- తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్
- లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన

వివరాలు 2లో..



## శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్

- అంతరిక్షం నుంచి కాలిఫోర్నియాలో ల్యాండ్ అయిన శుభాంశు శుక్లా!
- శుభాంశుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక
- 22 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత భూమిపైకి చేరిన నౌక
- ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు వ్యోమగాములు

**పెన్ పవర్ డెస్క్:**భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపిన అనంతరం 22 గంటల సుదీర్ఘ ప్రయాణం చేసి భూమిపై దిగారు. కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక దిగింది. వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు వారు భూమిని చేరారు.జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లిన శుభాంశు బృందం అక్కడ పలు కీలక పరిశోధనలు నిర్వహించింది.



వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## ఆధ్యాత్మికం: మౌనమే విజయానికి కీలకం...

సరిగ్గా మాట్లాడటం ఎంత కష్టమో, మౌనంగా ఉండటమూ అంతే కష్టం. అది మనసుకు సంబంధించిన భాష. వాక్కు అసలు పలకకపోవడం మౌనం కాదు. వాక్కును నియంత్రించడం మౌనం. అది ఒక యోగం, ఒక యాగం, సకలభాషలూ సమ్మిళితమైన విశ్వభాష. మౌనంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. మౌనం చాలా శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది. మాటల ద్వారా సాధించలేనిది మౌనం ద్వారా సాధించవచ్చు మౌనంగా ఉండటం వల్ల ఎదుటివారి మాటలు, భావాలు బాగా వినడానికి, అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అన్ని వైపుల నుంచీ సమున్నతమైన భావాలను, ఆలోచనలను ఆత్మీయంగా ఆహ్వానించమంటుంది రుగ్వేదం. అలా చేయాలంటే మౌనాన్ని ఆచరించడం ఎంతో ముఖ్యమని చాణక్యుడు చెబుతున్నారు. అలా మౌనంగా ఉన్నవాడే ఎప్పుడూ ప్రశాంతతను పొందగలడని ఆయన అంటున్నారు. మౌనంలో ఎంతో మహత్తరశక్తి ఉంది. మాట్లాడటం వెండి అయితే.. మౌనం బంగారం అంటారు. మితంగా మాట్లాడటమూ మౌనమే అని చెబుతోంది మహాభారతం. హితంగా, మితంగా మాట్లాడలేకపోతే మౌనమే మేలని విదురనీతి ద్వారా తెలుస్తోంది. మౌనం మాట్లాడినంత తీయగా ... మరే భాషా మాట్లాడలేదు. మాటలకు అందని కమ్మని భావాలు మౌన భాషకు ఉంటాయి. విమర్శలు వచ్చినప్పుడు వెంటనే ప్రతిస్పందించకుండా మౌనంగా ఉండి, వారి మాటలు పూర్తిగా విని, ఆ తర్వాత ఆలోచించి సమాధానం ఇవ్వాలి. ఇది మిమ్మల్ని మరింత ప్రశాంతంగా, తెలివిగా కనిపించేలా చేస్తుంది.అవసరం లేని విషయాల్లో జోక్యం చేసుకోకుండా, మౌనంగా ఉండటం వలన అనవసర వివాదాలకు, గొడవలకి దూరంగా ఉండేందుకు మౌనం ఎంతగానో ఉపయోగపడుతుంది. మౌనం పట్ల విశ్వాసం, గౌరవం ఉన్నవాళ్లకే మౌనం విలువ తెలుస్తుంది. ఆదిశంకరులు, విద్యారణ్యస్వామి, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి, శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి.. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, మహనీయుల సందేశాలు, ఉపదేశాలు సాధకులకు మౌనం ... మితంగా.. మాట్లాడడం వలన అంత శక్తిని సాధించారు.

మన సనాతన సంప్రదాయంలో మహానుభావులుగా చెప్పుకునే వారు ప్రబోధాలను, ప్రవచనాలను మౌనంగానే ఆలకించి, అవగాహన చేసుకుని హృదయాల్లో నిక్షిప్తం చేసుకున్నారు. అలాంటి వారందరికీ మౌనసాధనే ప్రధాన సాధనమైంది.

పాపపరిహారార్థం నిర్దేశితమైన అయిదు శాంతుల్లో మౌనం ఒకటని పురాణాలు చెబుతున్నాయి. అవి- 1.జపం 2.మౌనం 3.పశ్చాత్తాపం 4.శాంతి 5.దానం

మౌనంగా ఉండటం వలన ఆలోచించడానికి, విషయాలను విశ్లేషించడానికి తగిన సమయం దొరుకుతుంది. దీనివల్ల సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. మౌనంగా ఉండటం వలన ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.అయితే, అవసరమైనప్పుడు ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడాలి. ఇతరులను బాధ పెట్టే విధంగా మాట్లాడటం.... పరుష వచనాలు పలకడం .... అబద్ధాలాడటం, చాడీలు చెప్పడం... అసంబద్ధంగా ప్రేలాపనలు చేయడం- ఈ నాలుగూ నోటినుంచి వచ్చే దోషాలని చెబుతారు. వీటన్నింటికీ పరిహారం మౌనం. మౌనవ్రతం వల్ల ఈ నాలుగు దోషాలూ దరి చేరవు. మౌనంగా ఉన్నప్పుడు మనసును ధ్యానానికి, వైరాగ్యానికి అంకితం చేసినట్లయితే వారి జీవితానికి చరితార్థత ఏర్పడుతుంది. భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రమైన భాష మౌనమే. మనిషి మనుగడకు జీవనయాత్రకు శబ్దం ఎలా చోదక శక్తి అయిందో మౌనమూ అంతే! వినయం, శ్రవణం మౌనానికి అనుసంధానమైనప్పుడు.. అది విన్నవారికి గ్రహించే శక్తి పెరుగుతుంది. పాండవుల పురోహితుడు ధౌమ్యుడు ఉపదేశించిన సేవాధర్మనీతిని.... పాండవులు మౌనంగా, శ్రద్ధగా ఆలకించారు. విదురనీతి అంతా ధృతరాష్ట్రుడు విన్నదే. ...విశ్వామిత్రుడి యాగసంరక్షణార్థం వెళ్లినప్పుడు రామలక్ష్మణులు మహర్షి ఉపదేశమంతా మౌనంగా వింటూ ఆయన్ని అనుసరించారు. శిష్యుడి అభ్యుదయానికి.. రాణించడానికి.. మౌనమే ఎంతో దోహదం చేస్తుందని అలాంటి వారి ద్వారా తెలుస్తోంది.వానాకాలంలో కప్పలు బెకబెకమని అరుస్తాయి. పంచమ స్వరంలో మధురంగా పలికే కోయిల తనకిది సమయం కాదని మౌనంగా ఉండిపోతుంది. అలాగే మూరు?ల సభలో పండితుడైనవాడు మౌనంగానే ఉండిపోతాడు. అక్కడ మౌనమే పరమభూషణం. పరిశోధనలో ప్రవచన్నాన్ని వినే సందర్భంలో విజ్ఞత గలవాడు మౌనంగానే ఉంటాడు. మౌనం అలజడిని అశాంతిని అణచివేస్తుందంటారు బాపూజీ. మౌనంగా చేసే ప్రార్థనకు ఎంతో శక్తి.. మహిమ ఉంటాయి. మౌనంగా ఉన్నప్పుడు చుట్టూ జరిగే విషయాలను, ఎదుటివారి అభిప్రాయాలను గమనించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఇది కొత్త అవకాశాలను గుర్తించడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. కొన్నిసార్లు మనం మాట్లాడకుండా మౌనంగా ఉండటం వలన మన శక్తిని కూడదీసుకోవచ్చు. ఇది ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టడానికి, మరింత సమర్థవంతంగా పని చేయడానికి ఉపయోగపడుతుంది. మౌనం శ్వాసను తగ్గించి ఆయుష్షును పెంచుతుంది. మనిషికి మానసిక ఆరోగ్యం ప్రసాదిస్తుంది. ఆంతరిక శక్తిని వృద్ధిచేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. యోగసూత్రాల్లో మౌనానికి ఇచ్చిన ప్రాధాన్యం ప్రశంసనీయమైనది. రజస్తమోగుణాలను తగ్గించి .. మౌనం సత్వగుణాన్ని పెంపొందింపజేస్తుంది. ముక్తికి ప్రధాన సోపానం మౌనమేనని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి

- మొదటి పేజీ తరువాయి

తదితర శాఖల్లో డ్రోన్‌ల వినియోగంపై నెలకు ఒక జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

మనమిత్ర సేవలు మరింత సులభతరం

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలలో 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాష్ట్రంలోని 45,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి స్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్‌పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటీ అండ్ సీ స్పెషల్ సెక్రటరీ సుందర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఓ ప్రకార్ జైన్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

- మొదటి పేజీ తరువాయి

జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్రతరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది.ఆ కథనం ప్రకారం... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తారన్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్య దేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

- మొదటి పేజీ తరువాయి

మద్యం అమ్మకాల్లో పారదర్శకతను తగ్గించేందుకు ఆన్ లైన్ పేమెంట్ విధానాన్ని మాన్యువల్ మోడల్ గా మార్చడంలో మిథున్ రెడ్డిది కీలక పాత్ర అని సిట్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ముడుపులు ఇచ్చిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులు ఇచ్చారని, దీని కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ. 3,500 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఈ స్కామ్ లో మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అని లూథ్రా కోర్టుకు తెలిపారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారని చెప్పారు. మిథున్ రెడ్డికి నేర చరిత్ర ఉందని... ఆయనపై ఇప్పటికే 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను కొట్టివేయాలని కోరారు.

మిథున్ రెడ్డి తరపున టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో మిథున్ రెడ్డికి సంబంధం లేదని ఆయన కోర్టుకు తెలిపారు. షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇటీవలే ఈ వాదనలను విన్న హైకోర్టు ఈరోజుకు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ ను కొట్టివేస్తూ ఈరోజు తీర్పును వెలువరించింది.

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని

# మాకైతే తెలియదు.. మీకు తెలుసా?

- మొదటి పేజీ తరువాయి

అయితే, మీ పిటిషన్‌ను చదవమని రాహుల్ గాంధీని ఎలా బలవంతం చేస్తారని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది.

ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ గాంధీ గందరగోళం సృష్టిస్తున్నారని, ఒకవేళ ఆయన ప్రధానమంత్రి అయితే విధ్వంసం సష్టిస్తారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఆయన ప్రధాని అవుతారని మీకు తెలుసా అంటూ ప్రశ్నించింది.

అదే సమయంలో, రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు పెట్టేందుకు పిటిషనర్‌కు న్యాయపరమైన అవకాశం ఉందని పేర్కొంది. ఈ అంశంపై సావర్కర్ మనవడు పుణే కోర్టును ఆశ్రయించగా, అక్కడ దీనిపై విచారణ జరుగుతుందని న్యాయస్థానం గుర్తు చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరిగిందని, అక్కడ ఆ పిటిషన్‌ను కొట్టివేశారని తెలిపింది.

2022లో మహారాష్ట్రలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సావర్కర్ బ్రిటిష్ సేవకుడని ఆరోపించారు. బ్రిటిష్ నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. దీంతో సావర్కర్ మనవడు పుణే కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, విచారణ కొనసాగుతోంది.

# సీమకు జలసిరులు... రేపు నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఫేజ్-1 కాలువ విస్తరణతో అదనంగా 1,600 క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఏర్పడింది. దీనితో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుంది.

### 12 ఏళ్ల తర్వాత 40 టీఎంసీల వినియోగం

మల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావడంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా రాయలసీమ జిల్లాల్లోని స్థానిక చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో కేవలం 1-2 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. ఇప్పుడు కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగడంతో, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40 టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలిగింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునే అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా ఏర్పడింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాలను తీర్చనుంది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1 ద్వారా నంద్యాల జిల్లాలో 2,906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది.

### కూటమి ప్రభుత్వంతోనే మళ్లీ పనులు

2014-19 మధ్య రూ.4,317 కోట్లతో పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనులను 47 శాతం మేర పూర్తి చేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తయ్యాయి. తదుపరి ఫేజ్-2 పనులను కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తం ప్రాజెక్టు కోసం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో రాయలసీమలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమై, ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఇది ఒక ముందడుగు అని చెప్పవచ్చు.

# మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

తరపు న్యాయవాది విజయ్‌కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు.తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో

రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.

## బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలపై జేసీ స్పందస్తూ... నీలాంటి బచ్చా లీడర్లు ఎంతో మంది వచ్చి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. రప్పా రప్పా కాదు... రాత్రిపూట కన్ను ఎగరేస్తే ఎలా ఉంటుందో నీకు తెలుస్తుందని జేసీ వార్నింగ్ ఇచ్చారు. నువ్వు మాట్లాడే భాష మేం కూడా మాట్లాడగలం, నీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలమని చెప్పారు. కానీ, ఆ భాష తాము మాట్లాడితే ప్రజలు ఒప్పుకోరని అన్నారు. పొగరు తగ్గించుకుని మంచిగా ఉండాలని హితవు పలికారు. నీకు మంచి భవిష్యత్తు ఉంది, దాన్ని కాపాడుకో అని సూచించారు.

## శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్

- మొదటి పేజీ తరువాయి

ఈ 18 రోజుల్లో వీరు దాదాపు 96.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. అంతరిక్షంలో ఉన్న సమయంలో ఈ బృందం 230 సూర్యోదయాలను చూసింది.

### జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

## భూసేకరణను అడ్డుకోవాలని వినతి

- మొదటి పేజీ తరువాయి

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఇచ్చిన హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కరేడు గ్రామ రైతులు గత కొంతకాలంగా తమ భూములను ఇండోసోల్ పరిశ్రమకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో వారు భగ్గుమన్నారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు జగన్ ను కలిశారు. జగన్ ను కలిసిన సమయంలో రైతుల వెంట కందుకూరు అసెంబ్లీ స్థానం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. "రెండు మూడు నెలలుగా ఈ భూముల గురించి రైతులు పోరాడుతున్నారు. ఏడాదికి రెండు పంటలు పండే భూములు వారి నుంచి లాక్కునే ప్రయత్నం జరుగుతుంది. రైతులు తమ గోడు జగన్ గారిని కలిసి చెప్పుకున్నారు. ఇండోసోల్ కంపెనీకి మా ప్రభుత్వ హయాంలో మరో చోట భూములు కేటాయించాం. కానీ మేం కేటాయించిన చోట కాకుండా, ఇండోసోల్ కంపెనీకి ఈ కూటమి ప్రభుత్వం కరేడు వద్ద భూములు కేటాయించింది. దీనిని మేం వ్యతిరేకిస్తాం అని జగన్ గారు చెప్పారు. ఇది అన్యాయమన్నారు. రైతులను ఇబ్బంది పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సారవంతమైన భూములు రైతులకే చెందాలి కానీ, ఇలాంటి భూములు ఇవ్వకూడదన్నారు. సాగుకు నిరుపయోగం అయిన భూములు ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ గారు చెప్పారు" అని వివరించారు.

## ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం... హాజరైన టీడీపీ నాయకులు

- మొదటి పేజీ తరువాయి

ఓటరు జాబితా సవరణలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్, టీడీపీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న ఎన్నికల సంఘం లక్ష్యాన్ని స్వాగతించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపులో ఆధార్‌ను ఏకైక ఆధారంగా పరిగణించకూడదని సూచించిన టీడీపీ, 11 రకాల గుర్తింపు పత్రాలను అంగీకరించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించింది.

### ఆధునిక సాంకేతికత వినియోగం, డూప్లికేట్ ఓట్ల తొలగింపు

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబర్ కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటర్ ఐడెంటిటీని సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

### పౌరసత్వ నిర్ధారణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తావన

ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల సంఘానికి ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ, పౌరసత్వ నిర్ధారణ వారి అధికార పరిధిలో లేదని, 1995 సుప్రీంకోర్టు లాల్ బాబు హుస్సేన్ కేసు తీర్పును ఆయన గుర్తు చేశారు. అభ్యంతరాలు లేవనెత్తిన వారే ఆధారాలు సమర్పించాలని, ఆధారాలు చూపలేకపోయినంత మాత్రాన ఓటర్ల హక్కును రద్దు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

### బీహార్‌లో తొలగింపు ప్రక్రియపై ఆందోళన

బీహార్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ కారణంగా గందరగోళం నెలకొందని, గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆధార్ ఉన్నా ఇతర పత్రాలు లేని వారు ఎక్కువగా ఉండటం వల్ల నిజమైన ఓటర్లు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆర్టికల్ 326కు విరుద్ధమని, గుర్తింపు పత్రాలు లేని వారు భారతీయులేనని నిర్ధారించే బాధ్యత ప్రభుత్వ సంస్థలదేనని ఆయన అన్నారు.

### టీడీపీ సిఫార్సులు...

టీడీపీ తరఫున పల్లా శ్రీనివాస రావు, ఓటర్లకు అన్యాయం జరగకుండా న్యాయపరమైన, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

## తల్లిదండ్రులు లేని బాలిక విద్యకు అండగా మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ జూలై 15 :** నాకు తల్లిదండ్రులు లేరు సార్... కానీ నేను డాక్టర్ కావాలనుకుంటున్నాను. నాకు చదువు అవసరం... మీరు నాకు సహాయం చేయండి–ఇదే మాటలతో ఒక చిన్నారి ధర్మవరం పట్టణంలో గల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయాన్ని ఆశ్రయించింది. మాటలు చిన్నవిగా ఉన్నా, ఆలోచన గొప్పది. లక్ష్యం స్పష్టమైనది. ఆ చిన్నారి ఆత్మవిశ్వాసాన్ని గమనించిన మంత్రి కార్యాలయ సిబ్బంది, మంత్రికి ఈ విషయాన్ని తెలియజేయగానే వెంటనే స్పందించిన మంత్రి, అమ్మాయిని ధర్మవరం ఏపీ మోడల్ స్కూల్లో చేర్పించాల్సిందిగా మంత్రి కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆమెను వెంటనే ఇంటర్మీడియట్ ప్రవేశం కల్పించారు. కేవలం విద్య ప్రవేశమే కాకుండా, విద్యార్థిని తన చదువును అడ్డంకులే లేకుండా కొనసాగించేందుకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఇతర అవసరాలన్నింటినీ కూడా సమకూర్చారు. ఈ సందర్భంగా, మంత్రి ఆదేశాల మేరకు మంత్రి కార్యాలయ ప్రతినిధిగా మరియు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జిహరీష్ బాబు స్వయంగా ఆ బాలికకు దుస్తులు అందజేశారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

### హంద్రీనీవా కాలువకు నీటిని విడుదలకు
# ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి





**నంద్యాల, పెన్ పవర్ జూలై 15 :** ఈనెల 17వ తేదీ జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తయిన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్న సందర్భంగా ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హెచ్ ఎం ఎస్ ఎస్ కాలువకు నీటిని విడుదల చేయు కార్యక్ర మానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి .రాజకుమారి మాట్లాడుతూ.... హెచ్ఎన్ఎస్ ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి విడుదల చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. నీటి విడుదల కార్యక్రమానికి సంబంధించి మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వచ్చే అవకాశం ఉన్నందున సభా వేదిక నందు రైతులకు సీటింగ్, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. బహిరంగ సభ వద్ద రైతులు ఎటువంటి తోపులాటలు జరగకుండా అవసరమైన ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ... గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా నీటి విడుదల చేసే కార్యక్రమాలకు సంబంధించి రైతులు నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో
## భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించిన టీటీడీ చైర్మన్

**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** తిరుమల తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో మంగళవారం రాత్రి టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు బోర్డు సభ్యులతో పాటు భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు చైర్మన్‌తో మాట్లాడుతూ అన్నప్రసాదంలో అందిస్తున్న అన్నం చాలా మృదువుగా, వంటకాలు రుచికరంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా రాత్రి భోజనంలో వడను వడ్డించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అన్నప్రసాద వితరణ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేసిన చైర్మన్, భక్తుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా, ఎల్లప్పుడూ రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించేలా నిరంతరం పరిశుభ్రతతో కూడిన వంటకాలను సిద్ధం చేసి అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, జంగా కృష్ణమూర్తి, శాంతా రామ్, నరేష్ కుమార్, జానకీ దేవిలు కూడా చైర్మన్ తో పాటు భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్రకుమార్ కూడా ఉన్నారు.

### ఐ.ఆర్.సి.టి.సి. ఆధ్వర్యంలో
## జ్యోతిర్లింగంతో దివ్య దక్షిణ యాత్ర




**ఒంగోలు పెన్ పవర్ జూలై 15 :** ఐఆర్సిటిసి సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగంతో దివ్య దక్షిణ యాత్ర సికింద్రాబాద్ నుండి రామేశ్వరం, మధురై,కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచి, తంజావూరు, లలా లోని దేవాలయాలకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ను నడుపుతున్నట్లు విజయవాడ ఐ.ఆర్.సి.టి.సి. ఏరియా మేనేజర్ ఎం రాజా తెలిపారు. జూలై 19 న ప్రారంభమై 26 జూలై వరకు ఈ యాత్ర సాగుతుందని తెలిపారు.ఈ రైలులో స్లీపర్ క్లాస్, 3 ఏసీ, సెకండ్ ఏసి లు కలిగి ఉంటాయని తెలిపారు.స్లీపర్ క్లాస్ కు పెద్దలకు 14,100, పిల్లలకు 13,200 అలానే పాడేసిలో పెద్దలకు 22,300 పిల్లలకు 21, 200 సెకండ్ ఏసిలో పెద్దలకు 29,200 పిల్లలకు 27,900 లుగా ప్యాకేజీ ధరలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు విజయవాడ రైల్వే స్టేషన్ లోని రైల్వే రిటర్నింగ్ రూమ్ వద్ద ఉన్న ఐఆర్సిటిసి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. బుకింగ్ కొరకు 9281495848, 9281030714 నంబర్లను సంప్రదించవచ్చుని ఏరియా మేనేజర్ రాజా తెలిపారు.

## పేదరికాన్ని రూపుమాపేందుకే పి4

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జులై 15 :** రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర ఏ 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి 4 విధానాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లోని మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు భాగంగా సంబంధిత నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పి.4 జిల్లా టీం ప్రతినిధి రంజు కుమారి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 15 నుంచి జూలై 25వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలు మేరకు జిల్లాలో65451 ఇప్పటికే బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ – పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునః పరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాలు, వార్డుల్లో జులై 15 నుండి 25 జులై లోపల గ్రామసభలను నిర్వహించి తుది జాబితాను తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంద న్నారు. మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను పైకి తీసుకుని రావడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్లిరూట్స్, యాప్ ద్వారా వివరాలను సేకరించి దిగ్విజయం కార్యక్ర మాలను చేయవలసినదిగా కలెక్టర్ కోరారు. సిపిఓ శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధర్ నెల్లూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగిరి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## 17న ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన

– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ జూలై 15 :** ఈ నెల 17 వ తేదీన ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉన్న సందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్ లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లా పర్యటన ఏర్పాట్ల అంశం పై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17 వ తేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి ఉదయం 11 గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్‌కి చేరుకుంటారన్నారు... అనంతరం అక్కడ నుండి నంద్యాల జిల్లా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీటిని విడుదల చేసిన తర్వాత పబ్లిక్ మీటింగ్ లో పాల్గొంటారన్నారు... అనంతరం కర్నూలు ఎయిర్పోర్ట్‌కి విచ్చేసి విజయవాడ విమానా శ్రయానికి వెళ్తారన్నారు.. ఈ మేరకు తాత్కాలిక పర్యటన వివరాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్ లో బందోబస్తు కు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ అదనపు ఎస్పీ ని ఆదేశించారు... ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని డిఆర్వో, కర్నూలు ఆర్డీఓ, ఓర్వకల్లు తహసీల్దార్ లను ఆదేశించారు... ఎయిర్పోర్ట్ లో సేఫ్ రూమ్, మెడికల్ టీమ్ లను, అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇంచార్జి డిఎమ్హెచ్ ఓ, జిజిహెచ్ సూపరింటెండెంట్ లను ఆదేశించారు.. ఫైర్ కి సంబంధించిన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. పోలీస్ శాఖతో కోఆర్డినేట్ చేసుకొని కాన్వాయ్ ఏర్పాట్లు చూసుకోవాలని కలెక్టర్ డిటిసిని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,ఇంచార్జి డిఎమ్హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, డిటిసి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.


### ప్రజలు సంతృప్తి చెందేలా
## ఆయా శాఖలు చిత్తశుద్ధితో పని చేయాలి

– జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి



**అనంతపురం, పెన్ పవర్ జూలై 15 :** ప్రజలకు అందిస్తున్న సేవలు వారి సంతృప్తి మేరకు ఉండేలా చిత్తశుద్ధితో చేపట్టాలని, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజా స్పందన సమీక్ష ఉన్నత స్థాయిలో సమీక్షిస్తున్నారని, అన్ని శాఖల వారి పనితీరు ఆ దిశలో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్ నుండి డిఆర్డీఏ, సివిల్ సప్లైస్, వైద్య ఆరోగ్య, ఏపీఎస్ఆర్టీసీ, మున్సిపాలిటీ, సర్వే అండ్ ల్యాండ్ అండ్ సర్వే, అన్న క్యాంటీన్లు, విద్యుత్ తదితర సంబంధిత శాఖల పనితీరుకు సంబంధించి ఐవిఆర్ఎస్ ప్రశ్నల అనాలసిస్ సర్వేపై జూమ్ కాన్ఫరెన్స్ ను నిర్వహించి సమీక్షిస్తూ అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖకు సంబంధించిన ఐవిఆర్ఎస్ అనాలిస్ సర్వే సంబంధించి సంబంధిత శాఖలు కంపరేటివ్ పిపిటి తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందించాల్సిన సేవలను నాణ్యతగా, అవినీతికి తావు లేకుండా అందిస్తూ సంబంధిత శాఖలు ప్రజలలో మరింత సంతృప్త స్థాయి మరియు పాజిటివ్ రెస్పాన్స్ పెరగడానికి అధికారులు మరింత బాధ్యతతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు తదితరుల ముఖ ఆధారిత అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. అలాగే భూముల సర్వే నందు ముందస్తు నోటీస్ అందించి సక్రమంగా చేయాలని సూచించారు. మున్సిపల్, పంచాయితీలలో శానిటేషన్, డ్రైనేజీ శుభ్రపరిచే కార్యక్రమాలు రెగ్యులర్ గా సక్రమంగా జరగాలని, పర్యవేక్షించాలని అన్నారు. ఆర్టీసీ లో మెరుగైన చర్యలు తీసుకున్నందుకు ఆర్ఎం ను కలెక్టర్ అభినందించారు. అన్ని శాఖలు వారి సేవలు, విధుల పట్ల నిబద్ధత, అంకిత భావంతో పని చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని, ప్రజల సంతృప్త స్థాయి పెరుగుతుందని అన్నారు.

# తిరుమలలో టీటీడీ చైర్మన్ ఆకస్మిక పరిశీలన





**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** తిరుమలలో భక్తులకు అందుతున్న సేవలు, సదుపాయాల నిర్వహణపై మంగళ వారం టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు ఆకస్మిక తణిఖీలు నిర్వహించారు. శ్రీవారి ఆలయం వద్దకు విచ్చేసిన చైర్మన్, బోర్డు సభ్యులు అక్కడ భక్తులతో మమేకమై వివిధ సేవా సౌకర్యాలపై ఆరా తీశారు.

తిరుమలలో త్రాగునీరు, అన్న దానం, క్యూలైన్ల నిర్వహణ, పారిశు ధ్యంపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు చైర్మన్ తో మాట్లాడుతూ ఇటీవల తిరుమలలో భక్తుల కోసం అందు బాటులోకి తీసుకొచ్చిన సదు పాయాలు, సౌకర్యాలు మరింత మెరుగుపడ్డాయని, అన్నదానంలో అందిస్తున్న అన్నప్రసాదాలు ఎంతో రుచికరంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మీ, జంగా కృష్ణమూర్తి, శాంతా రామ్, నరేష్ కుమార్, జానకీ దేవి, అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# జిల్లాలోని రైతులకు పంటల బీమా ...

జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

పంటల భీమ పథకం గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా జాయింట్ కలెక్టర్



**తిరుపతి, పెన్ పవర్ జూలై 15 :** ఖరీఫ్ – 2025–26 సంవత్సరమునకు గాను రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా కొరకు నమోదు చేసుకోవచ్చునని, రైతులందరికీ అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ అధికారులతో పంటల బీమా పథకంపై డి ఎల్ ఎం సి కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి రైతు ఈ పంటల భీమ పథకాలను సద్వినియోగం చేసుకొనేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ 2025కు గాను, రెండు పంట భీమా పథకాలు అమలులో ఉన్నాయని వాటిని గూర్చి వివరిస్తూ

1. PMFBY (ప్రధానమంత్రి ఫషల్ భీమా యోజన)–దిగుబడి ఆధారంగా తిరుపతి జిల్లా లో ఈ పథకం క్రింద రెండు పంటలు ఖరీఫ్ కాలానికి నోటిఫై చేయబడినవి–వరి మరియు సజ్జ పంటలు అని తెలియజేసారు. వరి పంటకు గ్రామాన్ని భీమా యూనిట్ గా మరియు సజ్జ పంటకు జిల్లాను భీమా యూనిట్ గా పరిగణిస్తామని అన్నారు. తిరుపతి జిల్లా లో ఫ్యూచర్ జెనెరలి అనే కంపెనీ అమలు చేయు ఏజెన్సీ గా ఉండునని అన్నారు. వరి పంటకు– సమ్ ఇన్సూరెడ్: రూ.105000. ఒక హెక్టారుకు. రైతు కట్టవలసిన ప్రీమియం సొమ్ము రూ.420 హెక్టారుకు లేదా రూ.168 ఒక ఎకరానికి బీ లిసజ్జ పంటకు– సమ్ ఇన్సూరెడ్ : రూ.40000 ఒక హెక్టారుకు, ప్రీమియం సొమ్ము రూ.160 హెక్టారుకు లేదా రూ.64 ఒక ఎకరానికి. రైతులు ప్రీమియం చెలించవలసిన చివరి తేదీలు : వరి పంట కొరకు – 15–08–2025., సజ్జ పంటకు– 31–07–2025.

2. RWBCIS (పునర్నిర్మించిన వాతావరణ పంటల బీమా పథకం): తిరుపతి జిల్లాలో ఈ పథకం క్రింద వేరుశనగ మరియు నిమ్మ పంటలు నోటిఫై చేయడం జరిగిందని, మరియు మండలాన్ని ఇన్సూరెన్స్ యూనిట్ గా నిర్ణయించారని అన్నారు. వేరుశనగ పంటకు–సమ్ ఇన్సూరెడ్: రూ.70000 ఒక హెక్టారుకు బీ రైతు చెల్లించవలసిన ప్రీమియం సొమ్ము రూ.1400 హెక్టారుకు లేదా రూ.560 ఒక ఎకరానికి. చివరి తేదీ: 15–07–2025.నిమ్మ పంటకు–సమ్ ఇన్సూరెడ్ రూ.125000, ప్రీమియం సొమ్ము– రూ.6250 హెక్టారుకు లేదా రూ.2500 ఒక ఎకరానికి. చివరి తేదీ: 15–07–2025. రైతులు భీమా కొరకు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ నందు ఖరీఫ్ 2025 నుండి నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

బ్యాంకు నందు జూన్ 2025 మాసం నుండి పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంక్ సిబ్బంది పంటకు ఇచ్చిన రుణం నుండి ప్రీమియం సొమ్ము భీమా కొరకు జమచేయుదురని, పంట భీమా వద్దు అనుకున్న రైతులు ఒక అప్లికేషన్ లో బ్యాంక్ వారికి చివరి తేదీకి వారం ముందే సమర్పించవలెనని, తరువాత బ్యాంక్ వారు ప్రీమియం సొమ్మును అమలు చేయు కంపెనీకి జమ చేయుదురని అన్నారు.

పంట రుణం తీసుకోనటువంటి రైతులు , కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా స్వయంగా NCIP పోర్టల్ నందు నమోదు చేసుకోగలరని అన్నారు. నమోదు చేసుకోవడానికి 1.ఆధార్ కార్డ్ కాపీ, 2. యజమాని భూమి పత్రాలు, 3.కౌలు రైతులు ఐతే సి.సి.ఆర్.సి. పత్రం, 4.రైతు డిక్లరేషన్ లేదా పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం – రైతు సేవా కేంద్రం నందు, వ్యవసాయ సిబ్బంది జారీ చేయుదురు మరియు ఇ–పంట నందు నమోదు చేసుకొన్న పత్రం.5. మొబైల్ నెంబర్, 6.రైతు యొక్క సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ మొదటి పేజీ కాపీలను అప్లోడ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. పై వివరాలు గమనించి, రైతులు త్వరగా పంట భీమా కొరకు గడువు లోపల నమోదు చేసుకోవాలని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ,ఉద్యానశాఖ అధికారులతో కలిసి పంటల భీమ పథకం గోడ పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి దశరద రామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ గుంటూరు రవికుమార్, ఇన్సూరెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖతార్ వెల్డర్స్ ఉద్యోగావకాశాలు

**అనంతపురం పెన్ పవర్ జూలై 15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని వెల్డర్స్ ఉద్యోగావకాశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీ పి. వి. ప్రతాప రెడ్డి గారు తెలియజేశారు. వెల్డింగ్ ఉద్యోగానికి దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు 24 నుండి 45 సంవత్సరాల వయస్సు మధ్య ఉండాలి. అభ్యర్థులు ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత కలిగి ఉండి, నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలి.

మల్టీ వెల్డర్ ఉద్యోగానికి: రూ.52,000 నుండి రూ.61,500

వెల్డర్ ఉద్యోగానికి: రూ.42,500 నుండి రూ.52,000

కాంట్రాక్ట్ కాలం: 2 సంవత్సరాలు

ఉద్యోగదాత అందించే సదుపాయాలు :

ఉచిత వసతి, ఉచిత భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సదుపాయం, స్వదేశానికి ఒక్కసారి టిక్కెట్ సదుపాయం.

# మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం




**కడప పెన్ పవర్ జూలై 15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు మరియు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు దేశం కోసం మధ్యవర్తిత్వం పై 10–07–2025 నుండి 16–07–2025 వరకు ఒక వారం అవగాహన ప్రచారం లో భాగంగా 15–07–2025 వ తేదీన బ్యాంక్ అధికారులకు, చిట్ఫండ్ ప్రతినిధులకు, ఫైనాన్స్ కంపెనీ వారికి, ఏపీఎస్ఆర్టీసీ అధికారులకు మరియు ప్రజలకు న్యాయ సేవా సదన్ కడప నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను తెలియజేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి, ఎక్కువ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలి అన్నారు, జిల్లా వ్యాప్తంగా మధ్యవర్తిత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము సద్వినియోగం చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, చిట్ఫండ్ ప్రతినిధులు, ఫైనాన్స్ కంపెనీ వారు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, కంపెనీ న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి తోడ్పాటు

\- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 15 :** స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి తోడ్పాటు అయ్యేలా వారి రుణాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమా వేశపు మందిరంలో డిఆర్ డిఎ ద్వారా అమలు అవుతున్న పథకాల అమలు పై మరియు మైక్రో ప్లానింగ్ అప్రూవల్ కొరకు డిపిఎంలు, ఏపిఎంలతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి సంఘాల ద్వారా కొన్ని రుణాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు, బ్యాంకర్లు పనిచేయాలని తెలిపారు. సంఘాల ద్వారా రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి రికవరీ పై దృష్టి పెట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని వారి పై మరియు సంఘ సభ్యులకు సంబంధించిన నగదును బ్యాంకులలో డిపాజిట్ చేయాలన్నారు. ఈ విషయంలో డిపిఎం లు, ఏపీఎంలు క్షేత్రస్థాయిలో అవగాహన పెంచి సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శ్రీదేవి, డిపిఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై

# ఆర్.డబ్ల్యు.ఎస్.అధికారులు మానిటర్ చేయాలి

\- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ జూలై 15 :** శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ, డిఈలు, ఏఈలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల్లో ఇతర త్రాగునీటి పథకాలతో పాటు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలును కూడా ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈలు బాధ్యతగా పర్యవేక్షణ చేయాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం క్రింద 3.83 కోట్ల రూపాయల డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్ లో జమ కావడం జరిగిందని, ప్రభుత్వం నుంచి డబ్బులు రావడంతో కార్మికులు వెంటనే విధుల్లోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చోట్లకి శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం నీరు వెళ్లేలా చూడాలన్నారు. కింది స్థాయిలో ఎవరు ఉన్నా లేకున్నా పథకాలు అమలు జరిగేలా, కొనసాగేలా చూడాలని, త్రాగునీటి పథకం ఆపేస్తాము అంటే కుదరదన్నారు. పంప్ హౌస్‌లో, పైప్లైన్లలో నీళ్లు లేకపోతే అవి పగిలిపోయే అవకాశాలు ఉన్నాయని, పైపులు పగిలిపోతే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా రెగ్యులర్ వారిని పిలిపించి పనులు చేసేలా చూడాల్సిన బాధ్యతను ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తీసుకోవాలన్నారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం అమలుపై ప్రతిరోజూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఆయా పంప్ హౌస్ లలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వచ్చే శనివారం నాటికి వాటిని ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల ఫీడ్ స్థానిక పోలీస్ స్టేషన్ తో పాటు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కూడా అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ సురేష్, డిఈలు శిరీష, శ్రీనివాస్, ఏఈలు సురేంద్ర ప్రసాద్, శ్రీనివాసకుమార్, శివకృష్ణ, హరికృష్ణనాయక్, ధనుంజయ్, కార్యాలయం ఎస్ఈ పిఏ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

**తిరుమల పెన్ పవర్ జూలై 15 :** అక్టోబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను జూలై 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూలై 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జూలై 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

**22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల :**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, వార్షిక పుష్పయాగం టికెట్లను జూలై 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

**22న వర్చువల్ సేవల కోటా విడుదల :**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను జూలై 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగప్రదక్షిణం టోకెన్లు :**

అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జూలై 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా:**

శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను జూలై 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా :**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను జూలై 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల :**

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూలై 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల :**

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను జూలై 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

# పద్మభూషణ్ బి.సరోజ దేవి స్వర్గస్తులవడం సినీ సంగీతాభిమానులకు తీరని లోటు

\- నివాళులర్పించిన ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య సభ్యులు





**ఒంగోలు పెన్ పవర్ జులై 15 :** పద్మభూషణ్ బి.సరోజదేవి కన్నడ నాట పుట్టి పోలీస్ ఉద్యోగి అయిన తండ్రి బైరప్పకు ఉన్న నాటక రంగ ప్రవేశంతో అప్పుడప్పుడు తండ్రితో నాటక సమాజాల కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు స్ఫూర్తి పొంది తన 17వ ఏట మహాకవి కాళిదాసు సినిమాలో నటిస్తూ... తొలిసారి వెండితెరపై తళుకులీనారు. ఎంతో అందమైన నటిగా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 180 పైగా చిత్రాలలో నటించారు. వీరి కళా నైపుణ్యానికి కేంద్ర ప్రభుత్వం 1992 సం.లో పద్మభూషణ్ పద్మఅవార్డుతో సత్కరించారు అని, 2009లో ఎన్టీఆర్ అవార్డు వరించిందని ఆలిండియా కళారంగం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు.

మంగళవారం సాయంత్రం ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సివిఎన్ రీడింగ్ రూమ్ మరియు క్లబ్ ఆవరణలో బి సరోజా దేవి మృతికి సంతాపంగా వారి చిత్రపటానికి పూలమాలంకృతం చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందంతో పాటు అభినయం కూడా కలగలిసిన కథానాయకి బి సరోజా దేవి అని వారి తెలుగులో దాదాపుగా 25 సినిమాలకు పైగా నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలలో నిలచిపోయారని, తమిళనాట కన్నడ చిలుక, కర్ణాటకలో అభినయ సరస్వతిగా బిరుదు పొందారని కొనియాడారు. సంతాప కార్యక్రమంలో డాక్టర్ చల్ల నాగేశ్వరమ్మ, ఏల్చూరి అనంతలక్ష్మి, యు లక్ష్మీ తులసి, తాళ్లూరి శ్రీదేవి, సిహెచ్ శేషారత్నం, నిర్మలమ్మ, యశోద, ఎస్ వెంకటలక్ష్మి, ఎస్ కే బాబు, నక్క సుకుమార్, తబలా పాండు, జెర్మియా, గుర్రం కృష్ణ, కోటేశ్వరరావు, ఆర్మీ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి మంచి మాట డాక్టర్ సునీత



**కడప పెన్ పవర్ జూలై 15 :** ఈరోజుల్లో తీయగా ఉంటే నమిలి మింగేస్తారు చేదుగా ఉంటే ఊసేస్తారు అందుకే ఉప్పు లాగా ఉండు ఎంతవరకు అవసరమో అంతవరకే వాడుకుంటారు. మనం మంచి మనసుతో చూస్తే అంతా మంచి వాళ్ళే. ప్రేమ అభిమానం గౌరవం మర్యాద మనం ఇతరులకు ఎంత ఇవ్వగలమో అంతే తీసుకోగలం. అలవాట్లు ఆయుధాలు లాంటివి. మంచివైతే జీవితాన్ని పైకి లేపుతాయి అవి చెడ్డవైతే పైకి లేచిన జీవితాన్ని కూడా క్రింద పడేస్తాయి. నువ్వు దిగాల్సిన చోటు వచ్చేదాకే నీ దగ్గర ఉన్న టికెట్ కు విలువ ఉంటుంది. నీ ప్రయాణం ముగిశాక అది ఒక చిత్తు కాగితమే. అందుకే విలువ కోల్పోయే లోపు నీ ప్రయాణానికి అర్థాన్ని వెతుక్కో. అతిగా మాట్లాడితే గౌరవాన్ని కోల్పోతాం అతిగా ఆశ పడితే సంతోషాన్ని కోల్పోతాం అతిగా ఆలోచిస్తే ప్రశాంతతను కోల్పోతాం అతిగా ఇష్టపడితే విలువలు కోల్పోతాం అందుకే ఏది అతి వద్దు మితం ముద్దు. మానవ సహజ లక్షణం ఏమంటే మానవులంతా పుణ్యఫలాలని కోరుకుంటారు కానీ పుణ్యం మాత్రం చేయరు. పాప ఫలం వద్దంటారు కానీ పాపాలనే చేస్తుంటారు.

మానస సరోవరం

# వినాయక సాగర్‌లోని అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేసిన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

## వినాయకసాగర్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు







**తిరుపతి, పెన్ పవర్ జూలై 15 :** తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో వినాయక సాగర్ లో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఈ అవకాశాన్ని తిరుపతి జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం స్థానిక వినాయక సాగర్ లోని పలు అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి తో ప్రారంభోత్సవం చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి పట్టణంలో వినాయక సాగరకు పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులతో కలిసి ప్రారంభోత్సవం చేయడం జరిగిందని తెలిపారు. వినాయకసాగర్‌లో 3కోట్ల 30లక్షలతో అధునా తనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్ తిరుపతివాసులకు అందు బాటులోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. చిల్డ్రన్, అడల్ట్ పూల్ ఏరియాలు వేరు వేరుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 25 కి 21మీటర్ల పొడవు, ఆరు అడుగుల లోతు నుంచి 15 అడుగుల లోతుతో అధునాతన ఫిల్టరేషన్ తో స్విమ్మింగ్ పూల్ నిర్మించినట్లు తెలిపారు. 20 రోజుల్లో స్విమ్మింగ్ పూల్ నిర్వహణ టెండర్ పిలవడంతోపాటు ప్రొఫెసనల్ కోచ్ ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. వినాయకసాగర్ లో రోజు రెండు వేల మంది వాకర్స్ వాకింగ్ వస్తారని వారి దాహార్తి తీర్చేందుకు ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. మరో ఇరవై రోజుల్లో గ్లో గార్డన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ. వినాయకసాగర్‌లో మూడు కోట్ల ముప్పయ్ లక్షలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యాలు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. 2021లో స్మార్ట్ సిటీ మిషన్ లో భాగంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతో పాటు 17.95 లక్షలతో టాయిలెట్స్ ను నిర్మించగా అవి మంగళ వారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. అలాగే వాకర్స్ కోసం ఆప్కాస్ సంస్థ రెండు వేల లీటర్ల సామర్థ్యంతో ఆర్వో ప్లాంటను ప్రారంభించారు. వినాయక సాగర్ ను సర్వాంగసుందరంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పెండింగ్ లో పెట్టిన ప్రాజెక్టలను ఒక్కొక్కటిగా ఎన్డీఏ



ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తోందని ఆయన చెప్పారు. వందలాది మంది వాకర్స్ వినాయక సాగర్ లో వాకింగ్ వస్తుండటంతో వారికి టాయిలెట్స్ లేకపోవడంతో ఎంతో ఇబ్బంది పడ్డారని నేటితో ఆ సమస్య పరిష్కారమైందని ఆయన తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డీలు కార్పొరేషన్ ను అప్పుల కుప్పగా మార్చారని ఆయన ఆరోపించారు. కార్పొరేషన్ పై నూటయాభై కోట్ల అప్పు తండ్రికొడుకులు రుద్దిపోతే సగం మొత్తం ఇప్పటికే ఎన్డీఏ ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు. తిరుపతిన అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు నారా లోకేష్ లు కట్టుబడి ఉన్నారని చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా వినాయక సాగర్ కూడా సుందరంగా తీర్చి దిద్దామని అన్నారు. స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అధునాతనంగా ఈ స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, కార్పొరేటర్లు నారాయణ, రాధా రెడ్డి, అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

# ఫలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక చొరవ

## - రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల విడుదలకు జిల్లా కలెక్టర్ కృషి

## - నేడు సమ్మె విరమించి.. గ్రామాలకు ఇక నిరంతరాయంగా కొనసాగనున్న నీటి సరఫరా



**అనంతపురం, పెన్ పవర్ జూలై 15 :** అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.చేసిన కృషి ఫలించింది. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద కార్మికులకు జీతాలు, పీఎఫ్ బకాయిల కోసం ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు విడుదల చేయించేందుకు జిల్లా కలెక్టర్ నిత్యం మానిటర్ చేయడంతో రూ.3.83 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల విడుదలకు జిల్లా కలెక్టర్ విశేషంగా కృషి చేశారు. నిధులు విడుదల చేయించడంతో కార్మికులు 100 రోజుల తర్వాత మంగళవారం విధుల్లోకి రావడం జరిగింది. జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు ఇక నిరంతరాయంగా త్రాగునీటి సరఫరా కొనసాగనుంది. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద పెండింగ్ ఉన్న జీతాలు, పీఎఫ్ బకాయిల కోసం ఈ ఏడాది ఏప్రిల్ 06వ తేదీ నుంచి కార్మికులు జులై 15వతేదీ వరకు 100 రోజులపాటు సమ్మె చేశారు. దీంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలతో పాటు ఉరవకొండ నియోజకవర్గం లోని బెలుగుప్ప మండలంలో పలు గ్రామాలకు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈ, ఇతర అధికారులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి సమస్య ఎక్కడుంది, సమస్య పరిష్కరించేందుకు ఎన్ని నిధులు అవసరం అవుతాయి అనే అంశాలపై సమీక్షించారు. అంతేకాకుండా ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులతో, కార్మికులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి పెండింగ్ నిధులు, సమస్యపై చర్చించారు. పెండింగ్ బకాయిలకు సంబంధించిన బిల్లులను వెంటనే సీఎఫ్ఎంఎస్ లో అప్లోడ్ చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రతిరోజు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద బకాయిల చెల్లింపునకు ఉన్నతాధికారులతో చర్చించి బకాయిలు విడుదల చేయించేందుకు జిల్లా కలెక్టర్ కృషి చేశారు. శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల విషయమై రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారి దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లి నిధులు విడుదల చేయించేందుకు జిల్లా కలెక్టర్ ఎంతగానో కృషి చేశారు. దీంతో ప్రభుత్వం నుంచి శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద 3.83 కోట్ల రూపాయల డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్ లో గత సోమవారం జమ కావడం జరిగింది. దీంతో వెంటనే ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి మంగళవారం నుంచి కార్మికులు విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రోజు కార్మికులు సంబంధిత కాంట్రాక్టర్ తో సమావేశం నిర్వహించారు. కార్మికుల బకాయిలు చెల్లింపు విషయమై ఆర్డబ్ల్యుఎస్ అధికారులు కార్మికులతో మాట్లాడి వారు విధుల్లోకి వచ్చేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. బకాయిల చెల్లింపునకు కాంట్రాక్టర్ ఒప్పుకోవడంతో మంగళవారం నుంచి 100 రోజుల తర్వాత కార్మికులు విధుల్లోకి రావడం జరిగింది. ప్రజల్లోకి వచ్చి పీవీబిఆర్ డ్యాం వద్దనున్న శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం పంపు హౌస్ నుంచి స్విచ్ ఆన్ చేసి త్రాగునీటిని కార్మికులు విడుదల చేశారు. బకాయిలు చెల్లింపునకు కృషిచేసిన జిల్లా కలెక్టర్ కు కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్రాగునీటి సరఫరా చేసేలా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# మన ఘనమైన బలం ఏమిటి?

## సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పెన్ పవర్

**కడప పెన్ పవర్ జూలై 15 :** అత్యంతతీవ్రమైన అభిరుచి..పార్ట్ 2. అరుణిమ ఇంకా మాట్లాడుతూ..లక్ష్యం నిర్దేశించబడింది, ప్రణాళిక వేసుకున్నాం, మేడమ్ (మార్గదర్శకురాలు) కూడా తయారుగా ఉన్నారు. అయితే ఎప్పుడైతే రంగంలోకి దిగుతామో అప్పుడు మనమేంటో తెలుస్తుంది! నేను అక్కడకి చేరుకున్నాను. మేడమ్ "మాట్లాడటం, ఆలోచించడం ఏమీ ఉపయోగం లేదు అరుణిమా, ఎవరెస్టును నువ్వు జయించగలవని నిరూపించాలి" అని అంది. "నాకు ఒక్క అవకాశం కావాలి" అన్నాను. కానీ నేను నిజంగా పర్వతానికి చేరుకున్నప్పుడు, రోడ్డు నుండి బేస్ క్యాంప్ కు చేరుకోవడానికి ఇతరులకు కేవలం 2 నిమిషాలు పడితే, నాకు 3 గంటలు పట్టింది. నా కుడి కాలులోని ఎముకలు ఇంకా నయం అవలేదు. ఎడమ కాలు కృత్రిమమైనది, కానీ దాని గాయాలు ఇంకా పూర్తిగా మానలేదు, కొంచెం ఒత్తిడి కలగగానే రక్తస్రవించడం ప్రారంభమవుతుంది. అక్కడున్న మిగిలిన వారందరూ సాధారణంగా, ఆరోగ్యంగా ఉన్నారు. అందరూ నాతో, "అరుణిమా నువ్వు మెల్లగా రా" అని చెప్పేవారు. నేను ఎవరెస్ట్ ఎక్కాలని అనుకుంటున్నాను కానీ, నేను వారితో సమానంగా కనీసం నడవలేకపోతున్నాను – అని నా మనస్సులో ప్రతిసారీ అదే విషయం తిరుగుతూవుండేది. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉన్నా, ఒక రోజు నేను వారి కంటే ముందు చేరుకుంటాను అని అప్పుడు నాకు నేనే సంకల్పించుకున్నాను, ...

అయితే మీరు నమ్మకపోవచ్చు 8 నెలల తర్వాత, నేను మొత్తం బరువును మోస్తూ అందరితో పాటు బేస్ క్యాంప్ నుండి బయలుదేరి, మొదటగా శిఖరాగ్రానికి చేరుకున్నప్పుడు, వాళ్ళు నా వద్దకి వచ్చి " నువ్వు ఏం తింటున్నావు !" అని ఆశ్చర్యంగా అడిగినప్పుడు నేను చాలా ఆనందపడ్డాను.

ఆ తర్వాత నాకు స్పాన్సర్ షిప్ వచ్చింది. నేను ఎట్టకేలకు ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు వెళ్ళినప్పుడు, ప్రయాణంలో నా అతిపెద్ద సవాలు ఎదురైంది. ( నేపాల్, టిబెట్ సరిహద్దులలో నివసిస్తూ, హిమాలయ పర్వతారోహణ నైపుణ్యానికి ప్రసిద్ధి చెందినవారిని 'షెర్పా' అంటారు) నాకు కృత్రిమ కాలు ఉందని షెర్పా తెలుసుకుని, 'ఆమెని నాతో తీసుకెళ్ళలేను, తీసుకెళ్తే నేనూ చనిపోతాను', అని అన్నాడు. చాలా కష్టపడి అతనిని ఒప్పించాల్సి వచ్చింది. మా బృందంలో ఆరుగురం ఉన్నాం. నేను మొదటిదానిని, కానీ నేను ఆకుపచ్చ, నీలం మంచుదిబ్బలను చేరుకోగానే, నా కృత్రిమ కాలు జారిపోయేది. "అది అసాధ్యం అరుణిమా, బలవంతం చేయవద్దు" అని షెర్పా నాతో అన్నాడు. నేను "బాధపడకు, అది నా కాలు, దానిచేత ఎలా పని చేయించాలో నాకు తెలుసు" అన్నాను.

మూడు, నాలుగు, ఐదు సార్లు ప్రయత్నించిన తర్వాత, చివరకు నా పాదం మంచును పట్టుకునేది. మంచు బయటకురావడం వల్ల, నేను నా పాదాలను అక్కడే ఉంచి నడవడం ప్రారంభించేదాన్ని.

మేము మూడవ క్యాంప్ కి చేరుకున్నాం. క్యాంప్ 3, సౌత్ పోల్ సమ్మిట్ విషయానికి వస్తే, అత్యుత్తమ పర్వతారోహకుల, అత్యంత ధైర్యవంతుల ఆత్మలు కూడా వణుకుతాయి .... తమ కళ్ల ముందే ఎవరైనా చనిపోవడం చూసినప్పుడు – మనం ఏ లక్ష్యాన్నైతే సాధించడానికి ప్రయత్నిస్తున్నామో మనుషులు దాని కోసం చనిపోతున్నారు – అన్న ఇలాంటి ఆలోచనలు మనసులోకి రావడం ప్రారంభిస్తాయి!! వాతావరణం స్పష్టంగా ఉంటుంది కాబట్టి చాలా వరకు పర్వతారోహణ రాత్రిపూట జరుగుతుంది. నేను రాత్రి క్యాంపు 4 నుండి బయలుదేరినప్పుడు, నేను నా హెడ్ లైట్ లను ఎటు తిప్పినా, అక్కడ నాకు మృతదేహాలు మాత్రమే కనిపించేవి. నాకు ఒళ్ళు గగుర్పొడిచేది, నా వెంట్రికలు నిక్కబొడుచుకునేవి. ఏమి చేయాలో నాకు అర్థమయ్యేది కాదు! పైగా నా దారిలోనే ఒక బంగ్లాదేశీయుడు ఉన్నాడు, అతను తన చెయ్యి కదుపుతూ, మూలుగుతూ ఉన్నాడు. నేను ఎంత భయపడ్డానో వర్ణించలేను. అతని ఆక్సిజన్ అయిపోతూ ఉంది, అతను చనిపోయే పరిస్థితిలో ఉన్నాడని మాత్రం నాకు అర్థమయ్యింది

ఆ తరువాత, నేను 10–15 నిమిషాలు అక్కడే నిల్చున్నాను. నేను ఆ మృతదేహాలను చూసి, 'మీరందరూ ఎవరెస్ట్‌ని అధిరోహించి ఉంటే బాగుండేది, అలా జరగలేదు కాబట్టి మీ అందరి కోసం నేను ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ప్రాణాలతో తిరిగి వస్తాను', అని అన్నాను.

మనం ఏమి అనుకుంటామో, మన శరీరం కూడా అదే విధంగా ప్రవర్తించడం ప్రారంభిస్తుంది. నేను మృతదేహాలను దాటుకుని ముందుకు సాగడం ప్రారంభించాను. నేను సౌత్ సమ్మిట్ కి చేరుకున్నప్పుడు, నా షెర్పా నాకు అఘాతాన్ని కల్గించే వార్త ఇచ్చాడు: "అరుణిమా తిరిగి వచ్చేయ్, నీ ఆక్సిజన్ అయిపోతోంది!"

ఎవరెస్ట్ శిఖరం నాకు నడిచి వెళ్లే దూరంలో ఉంది, నేను నా లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాను. నేను, "సార్, ఏం చెప్తున్నారు, నేను ఇప్పుడు వెనక్కి వెళ్ళను", అని అన్నాను.

"అరుణిమా నువ్వు సజీవంగా ఉంటే మళ్ళీ ప్రయత్నించవచ్చు. నువ్వు ఇంకోసారి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించవచ్చు", అని అన్నాడు. కానీ నేను మాత్రం, "లేదు.. జీవితంలో ఇలాంటి సువర్ణావకాశం మళ్లీ మళ్లీ రాదు. దాన్ని చేజిక్కికోవడం లేదా వదులుకోవడం మన చేతుల్లో ఉంది", అన్నాను. ఎంతో కష్టపడి స్పాన్సర్ షిప్ పొందిన నేను ఈ అవకాశాన్ని ఎప్పటికీ వదులుకోలేను. ఈ సువర్ణావకాశం తిరిగి రాదు.

బచేంద్రి మేడమ్, మా అమ్మ నాకు వివరించిన ఒక్క విషయం ఏమిటంటే, జీవితంలో కొన్నిసార్లు మనందరం ఒంటరిగా ఉండే పరిస్థితులు వస్తాయి. అప్పుడు నిర్ణయం మనకు మనంగానే తీసుకోవాలి. నువ్వు ఎక్కడ ఉన్నా, ఆగి, నిలబడి, కొంచెం వెనక్కి తిరిగి చూసుకో, ఒక్కొక సమయంలో ఒక్కొక్క అడుగు వేస్తూ ఇక్కడకు చేరుకున్నావని గుర్తుచేసుకో. ఇంకొక్క అడుగు ముందుకు వేస్తే, నువ్వనుకున్న అగ్రస్థానానికి నువ్వు చేరుకుంటావు. వారి మాటలు, ఎదురుగా ఎవరెస్ట్ శిఖరాగ్రం నా మదిలో ఒక చిత్రంపటంలా పరిగెడుతున్నాయి. " సోదరా, ఏమీ జరగదు, రా", అని నేను మొదట షెర్పాను ఒప్పించటానికి ప్రయత్నించాను. అప్పుడు కూడా అతను ఒప్పుకోక పోవడంతో ఒక అడుగు ముందుకేసి, 'నేనే వెళ్ళాలి, నేనే వెళతాను' అని నిర్ణయించుకున్నాను. సుమారు గంటన్నర తర్వాత, నేను శిఖరాగ్రం పైన ఉన్నాను. దాని గురించి మాట్లాడిన ప్రతిసారీ నేను ఇప్పటికీ ఆ అనుభూతిని తిరిగి అనుభవిస్తాను, నా వెంట్రికలు నిక్కబొడుచుకుంటాయి. నేను ప్రపంచపు అగ్రస్థానంలో ఉన్నాను అని అందరికీ చెప్పడానికి నా రెండు చేతులను పైకెత్తి గట్టిగా అరవాలని అనిపిస్తుంది. ఒకసారి ఓడిపోయిన తర్వాత తిరిగి పోరాడలేమని, లేదా ఇక మళ్లీ ఏమీ చేయలేమని భావించే వారికి, – ' కాదు, మీరు ప్రతిదీ చేయగలరని' – గట్టిగా అరిచి, ఆ పై నుండి చెప్పాలనుకున్నాను! ఒక వ్యక్తి శరీరం నుండి వికలాంగుడు అన్న ఆలోచన ఒక్కటే ఉంది, కానీ బలమైన సంకల్ప శక్తి ఉన్నవాడు ఎప్పటికీ వికలాంగుడు కాదు.

నేను షెర్పాతో, "దయచేసి ఒక ఫోటో తీయండి ఎందుకంటే అందరూ ఫోటో అడుగుతారు", అన్నాను. నేను చాలా సంతోషంలో ఉన్నాను, జాతీయ జెండాను కౌగిలించుకుని, "ఫోటో తీసుకో" అన్నాను. అతను ఫోటో తీశాడు. తరువాతిసారి నేను షెర్పాను వీడియో కూడా తీయమని అడిగినప్పుడు అతను చాలా కోపంగా, "నీకు పిచ్చి పట్టింది, ఆక్సిజన్ అయిపోవచ్చింది, నువ్వు చచ్చిపోతావు. నేను మాత్రం దిగిపోతున్నాను", అన్నాడు. నేను ఇంత పెద్ద అపాయకరమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నానని మీరు కూడా ఆలోచిస్తూ ఉండచ్చు, ఎందుకంటే నేను ఏ క్షణంలోనైనా నా జీవితాన్ని కోల్పోయుండేదాన్ని. కానీ నేను సజీవంగా తిరిగి వెళ్లకపోతే, కనీసం ఈ వీడియో అయినా నా దేశానికి చేరుకోవాలి అన్న ఆలోచన నాకు వచ్చింది.

నాకు 11 ఏప్రిల్ 2011న ప్రమాదం జరిగింది. 21 మే 2013న 10:55 కి నేను ఎవరెస్ట్ శిఖరం వద్ద ఉన్నాను... కేవలం 2 సంవత్సరాలలో ! ఎవరెస్ట్ ను జయించాలనే లక్ష్యం – నా జీవితం, నా అభిరుచి, నా మొండితనం. నేను మెలకువగా ఉన్నా, నిద్రపోతున్నా ఎవరెస్టును మాత్రమే చూడగలిగాను. ఎవరైనా తమ లక్ష్యాన్ని సాధించాలనుకుంటే, మనస్సు నుండీ, హృదయం నుండీ ఈ ఉద్రేకం వస్తే తప్ప దానిని సాధించలేరు. చివరికి, షెర్పా వీడియో కూడా తీసాడు. నేను శిఖరాగ్రం మీద ఉన్నప్పుడు, ఇతర వ్యక్తులు కూడా ఉన్నారు, కానీ నేను 10:55కి అధిరోహించాను. ఎవరైనా 11:00 తర్వాత శిఖరాగ్రానికి చేరుకుంటే, దానిని ఆత్మహత్యాయత్నం అంటారు. నేను క్రిందికి దిగుతూ నడవడం ప్రారంభించిన వెంటనే, కొంచెం దూరంలో నా ఆక్సిజన్ అయిపోయింది. నేను క్రింద పడిపోయాను. షెర్పా, "అరుణిమా నువ్వు చేయగలవని నేను ఖచ్చితంగా అనుకోలేదు కానీ నువ్వు సాధించావు. ఇప్పుడు నువ్వు సజీవంగా వెనక్కి రావాలని నేను కోరుకుంటున్నాను. లే, లేచి నిలబడు", అని అన్నాడు. అతను నన్ను నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. నేను నిలబడలేకపోతున్నాను. మనకు ఇక్కడ క్రింద మన నియమాలు ఉన్నట్లే, పైన ఉన్న సర్వశక్తిమంతుడికి కూడా నియమాలు ఉంటాయని అంటారు. నా సమయం రానప్పుడు, ఆయన జాబితాలో నా పేరు లేనప్పుడు, ఆయన నన్ను తీసుకెళ్ళలేరు కదా.

నేను 7 గంటలపాటు రైల్వే ట్రాక్‌పై పడి ఉన్నప్పుడు ఈ విశ్వాసం ధృవీకరించబడింది.. అప్పుడు కూడా ఆయన నన్ను రక్షించాడు, కాబట్టి నేను కొంత చరిత్ర సృష్టించడానికి మాత్రమే రక్షించబడ్డాను అని అనుకున్నాను. నేను సానుకూలంగా ఆలోచించాను, అప్పుడే ఒక విదేశీ పర్వతారోహకుడు దిగువ నుండి పైకి వస్తున్నాడు. అతని వద్ద రెండు ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయి. వాతావరణం బాగా లేకపోవడంతో ఒకటి విసిరేసి మరొక దానితో వెనక్కి వెళ్లిపోవడం ప్రారంభించాడు.

నా షెర్పా త్వరగా ఆ ఆక్సిజన్ సిలిండర్ తెచ్చి నాకు ఇచ్చి, "అరుణిమా నువ్వు చాలా అదృష్టవంతురాలివి, నీకు ఇక్కడ ఆక్సిజన్ దొరికింది. నిజంగా ఆ పరమాత్ముడు కూడా నువ్వు బ్రతకాలని కోరుకుంటున్నాడు", అన్నాడు. అతను నన్ను అదృష్టవంతురాలని పదే పదే అంటున్నాడు. అదృష్టం లాంటి వాటిని నమ్మేవాళ్ళు మీలో కొందరు ఉండొచ్చు, కానీ నేను అదృష్టాన్ని నమ్మను, ఎందుకంటే గెలవాలనే తపన ఉన్నవారికి విధి కూడా అనుకూలిస్తుందని నేను నమ్ముతున్నాను. గెలవాలనే సంకల్పం లేకపోతే, అన్ని వైపుల నుండి సాకులు మాత్రమే ఉంటాయి.

బహుశా నేను వెనక్కి వచ్చేసి ఉంటే, నేను కూడా చాలా సాకులు చెప్పి ఉండేదానిని. నా ఆక్సిజన్ అయిపోయిందని చెప్పిఉండేదాన్ని. నా కుటుంబం లేదా బచేంద్రి మేడమ్ లేదా ఎవరైనా నన్ను ప్రశ్నించి ఉండేవారు కాదు. కానీ నాకు నేను ఎప్పుడైనా సమాధానం చెప్పుకోగలిగేదానినా! లేదు, ఖచ్చితంగా లేదు!

చివరికి, నేను క్రిందికి వస్తున్నాను. నా ఆనందానికి అవధులు లేవు, నేను ఎవరెస్ట్ ను అధిరోహించిన విషయాన్ని ఎవరితోనూ పంచుకోలేకపోయాను. నేను వేగంగా నడవడానికి నా మడమను ఉపయోగిస్తూ నడవడం వల్ల, అకస్మాత్తుగా నా కృత్రిమ కాలు పూర్తిగా బయటకు వచ్చేసింది.

ఎవరెస్ట్ పై ఉష్ణోగ్రత – 60 డిగ్రీలకు పడిపోయింది. నా చెయ్యి అస్సలు కదలట్లేదు. చేతి నుండి రక్తం కారుతోంది. అప్పటికే ఒక కాలు తెగిపోయింది, ఆ క్షణంలో నా చెయ్యి కూడా తెగిపోతే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది...అది ఎలా అనిపించి ఉంటుందో ఒకసారి ఊహించుకోండి! నా చేయి పనిచేయడం లేదని పదే పదే షెర్పాతో చెబుతున్నాను. 'క్రిందకి దిగిపోతే బాగుపడుతుంది, కంగారు పడకు', అని అతను నాతో చెబుతూనే ఉన్నాడు..

ఆఖరికి నా కళ్లలోంచి కన్నీళ్లు రావడం మొదలయ్యాయి. ఏడవడం వలన ఏమీ ఉపయోగం లేదని అర్థమైన మరుక్షణం కన్నీళ్లు తుడుచుకున్నాను. నా చేతిలో ఉన్న తాడు పట్టుకుని కాళ్లు లాగుతూ, ఈడుస్తూ నడవడం మొదలుపెట్టాను. కొంత దూరం నడిచిన తర్వాత, నేను కాలును సరిచేసుకున్నాను. నాలుగవ క్యాంప్ 30,500 అడుగుల వద్ద ఉంది. సాధారణంగా, అందరూ దీనిని 16 నుండి 17 గంటల్లో చేరుకుంటారు... నాకు మాత్రం 28 గంటలు పట్టింది.

అరుణిమ ప్రాణాలతో తిరిగి రాదని అందరూ ఊహించారు, కానీ నేను దక్షిణ ధృవం చేరుకుని, టెంట్ తెరిచినప్పుడు, అందరూ "ఏయ్, మేమంతా నువ్వు పోయావనే అనుకున్నాం", అంటూ అందరూ ఆనందంతో నవ్వడం మొదలుపెట్టారు. నేను ఇవన్నీ పంచుకోవడం వెనుక ఒకే ఒక ఉద్దేశ్యం ఉంది, ప్రతిదీ మనపై ఉంది, మనం ఏది చేయాలనుకుంటే అది చేయగలం.



ఈ నాలుగు వాక్యాలతో ఈ కథను ముగించాలనుకుంటున్నాను....

ఈ గ్రద్ద నిజంగా ఎగరాల్సినది ఇంకా ఉంది, ఈ పక్షి యొక్క పరీక్ష ఇంకా రావలసి ఉంది, నేను ఇప్పుడు కేవలం సముద్రాన్ని దాటాను, మొత్తం ఆకాశాన్ని జయించటం ఇంకా మిగిలి ఉంది.

అరుణిమ

మన సంకల్ప శక్తే మన అతిపెద్ద బలం!

మొదటి అడుగులోని దృఢ సంకల్పం, చివరి వరకు ఉండే పట్టుదల, ఖచ్చితంగా మీకు పూర్తి విజయాన్ని అందిస్తుంది. దృఢమైన హృదయంతో ప్రవేశిస్తే, మార్గం సగం సుగమమయినట్లు తెలుస్తుంది.

**దాజీ**

**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

# విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని కలిగివుండాలి




**కర్నూలు పెన్ పవర్ జూలై 15 :** క్రిష్ణగిరి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాల యందు వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ కౌన్సిలింగ్ అంశాల తో పాటు కుటుంబంలోని విషయాలను పాఠశాలలోని సంఘటనలపట్ల పాజిటివ్ థింకింగ్ తో నడుచుకోవడం అనే అంశాల పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ డా!! వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల కలిగి ఉండాలని తెలిపారు. సుధా చంద్రన్, స్టీఫెన్ హాకింగ్ , హెలెన్ కెల్లర్ లాంటి వారు విజయం సాధించడానికి ఈ లక్షణాలే ముఖ్య కారణం అని, కావున మన దృఢమైన సానుకూల దృక్పథం, మన వైఖరి మనం అనుకున్న లక్ష్యాన్నిచేరుకోవడానికి తోడ్పడతాయని తెలిపారు. అలాగే విద్యార్థులు చదివినది గుర్తుకు రావటం లేదని, మంచి మార్కులు రాలేదని, పరీక్షలను తలచుకొని, ఫైయిల్ అయితే తల్లిదండ్రులు ఏమంటారోని మానసికంగా ఆందోళన చెంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. కావున విద్యార్థులు ఎప్పుడు అధైర్య పడకూడదని, మానసికంగా ఆందోళన చెందినపుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లు కిరణ్ 1800 599 0019, ఆసరా 098204 66726, వన్ లైఫ్ ఫౌండేషన్ 07893078930 మదలగు వాటిని సంప్రదిస్తే తక్షణ సహాయం అందిస్తారని, ఈ నంబర్ల ద్వారా దాదాపు 1300 మంది సైక్రియాటిస్టులు, సైకాలిజిస్టులు, వృత్తి నిపుణులు తమ సందేహాలను తీర్చి మానసిక ఆందోళనను తగ్గిచేందుకు తోడ్పడతారని తెలిపారు. చైల్డ్ సైకాలజిస్ట్ మరియు వ్యక్తిత్వ వికాస నిపుణులు జ్యోతిర్మయి మాట్లాడుతూ మానసిక వికాసంతో పటు మనోధైర్యం ను ఎలా పెంపొందిచుకోవాలి, తెలుపుతూ ముఖ్యంగా రోజువారీ జీవన విధానంలో డోస్ అనే హార్మోనులు పెంచుకోవాలని అంటే, డాపమిన్ తమను తాము ఉత్సాహపరుచుకోవడం , కౌమార దశలో జరిగే హార్మోనులు విడుదల వల్ల కొందరిలో ప్రవర్తన లోపాలు ఉంటాయి, ఉపాధ్యాయులు వాటిని గమనించి తల్లిదండ్రుల ప్రేమను అందిచంగలగాలని తెలిపారు.

## పురపాలక పరిధిలోని

# టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ముస్సిపాలిటీలలో శానిటేషన్ సక్రంగా జరగాలి

ఓవర్ హెడ్ నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలి

ముస్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు ఉదయం సమయంలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 15 :** మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు ఉదయం సమయంలో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలో వివిధ మున్సిపాలిటీల ఆదాయ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవివిధమున్సిపాలిటీలలో టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా పనిచేసే విధంగా మీరు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ మున్సిపాలిటీలలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందజేయాల్సిన బాధ్యత మీ పైన ఉన్నదని తెలిపారు. నిధులకు ఎలాంటి కొరత లేదని తెలిపారు. మున్సిపాలిటీని ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా మీరు కృషి చేయాలని తెలిపారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రంగా నిర్వహించాలని తెలిపారు, పుంగనూరు, పలమనేరు, మున్సిపాలిటీలలో ఉన్న ఏరియా ఆసుపత్రులను కమిషనర్లు తనిఖీ చేయాలని తెలిపారు, ప్రతిరోజు శానిటేషన్ పై మీరు ఎలా అమలు చేస్తున్నారు ఫోటోలు రూపంలో నాకు అందజేయాలని పేర్కొన్నారు, త్వరలో విస్తారంగా జిల్లాలో వర్షాలు కురుస్తాయని అప్పుడు త్రాగునీటి పైపులైన్లు ఎక్కడ లీకేజీ జరగకుండా చూడాలని, అలాగే పది రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లోరిన్ తో శుభ్రం చేయాలని తెలిపారు, డెంగు, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రజలు గురుగాకుండా ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వివిధ మున్సిపాలిటీలలో నాణ్యమైన విద్యుత్ దీపాలు అమర్చాలని కమిషనర్లను ఆదేశించారు. మున్సిపాలిటీలలో ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆహార పరిశ్రమల మంత్రి

# చిరాగ్ పాస్వాన్ తిరుపతి జిల్లాకు రాక

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ జూలై 15 :** కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి శ్రీ చిరాగ్ పాస్వాన్ రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా రానున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 16న గౌ. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి సాయంత్రం ఢిల్లీ ఎయిర్పోర్ట్ నుంచి బయలుదేరి తిరుపతి ఎయిర్పోర్ట్ చేరుకుంటారని, అనంతరం తాజ్ హోటల్‌కు చేరుకొని రాత్రి బస చేస్తారని తెలిపారు. 17వ తేదీ ఉదయం 4.30 గంటల సమయం నందు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని అనంతరం తిరిగి 7.45 గంటలకు తిరుపతిలోని తాజ్ హోటల్ చేరుకొని ఉదయం 11.10 నుండి 12.30 గంటల వరకు ఐఐటీ, తిరుపతి నందు జరుగు ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమానంతరం మధ్యాహ్నం 2.05 గంటలకు తిరుపతి ఎయిర్పోర్ట్ నుండి తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు.

# జన్ సురక్ష పథకాలను గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లండి

## - ఇన్‌ఛార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్



**వైయస్సార్ కడప పెన్ పవర్ జులై 15 :** జన సురక్ష పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకొని వెళ్లి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ఈ అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని బోర్డు రూమ్ కాన్ఫరెన్స్ హాలు నందు జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈ నెల నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కు సంబంధించి సంబంధిత అధికారులతో ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ జెసి చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మరియు జెసి అదితి సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన మరియు అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని ఎల్ డి ఎం ను ఆదేశించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి, వారిచే బ్యాంకు ఖాతాలను తెరిపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ను జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా నిర్వహించడంలో సంబంధిత శాఖలైన డిఆర్డిఏ, మెప్మా మరియు డ్వామా శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. బ్యాంకులకు సంబంధించిన సమస్యలు ఉన్నవారితో పాటు బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి ఉన్నవారు అందరూ హాజరవుతారని తెలిపారు. జన్ ధన్ బ్యాంకు ఖాతాల ఈ కేవైసీ చేయనివారిని గుర్తించి ఈ కేవైసీ అప్డేషన్ ప్రక్రియను వేగంగా చేయాలన్నారు. జన్ సురక్షా పథకాల గురించే కాకుండా ఆర్థిక అక్షరాస్యత పై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రస్తుత పరిస్థితులలో డిజిటల్, సైబర్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించడం కూడా ముఖ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో డిఆర్డిఏ, అర్బన్ పరిధిలో మెప్మా శాఖల ద్వారా ఎస్ హెచ్ జి మహిళలను భాగస్వాములను చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.డ్వామా ద్వారా ఉపాధి కూలీలకు బ్యాంకు ఖాతాలు తెరవడం చేయాలన్నారు.అలాగే ఈ అవగాహన సదస్సులో అటల్ పెన్షన్ యోజన ఖాతాలు తెరవడం పై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో బ్యాంకులు ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో భాగంగా జులై 23, 30, ఆగస్టు 6 తేదీలలో ప్రతి గ్రామస్థాయిలో సమావేశాల నిర్వహణ చేపట్టాలన్నారు. రెండవ విడత మూడవ విడతలో చేసే కార్యక్రమాలలో మొదటి విడతలో గ్రామపంచాయతీలలో లోటుపాట్లను సరిదిద్దుకొని పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు జనార్ధన్, నాబార్డ్ ఏజిఎం విజయ విహారి,డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, జెడ్పి డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొనగా, వర్చువల్ విధానంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అధ్యక్షులు కుక్కల రామారావుకు అభినందనలు




**మండపేట.పెన్ పవర్. జూలై 15 :** మండపేటశ్రీ వల్లూరి అప్పారావు ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన కుక్కల రామారావు ను పలువురు అభినందించారు.మండపేట బిసి ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంఘ సభ్యులు ఆయన్ని సత్కరించారు. బిసిలను గుర్తించి నామినేటెడ్ పోస్టును రామారావుకి ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం బిసి,ఎస్సీ,ఎస్టీ మైనారిటీలను రాజ్యాధికారంలో కూడా భాగస్వాములు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కోన సత్యనారాయణ, బిసి ఎస్టీ మైనారిటీ సంఘ అధ్యక్షులు దూలి జయరాజు,సెక్రటరీ వీరమల్లు శ్రీనివాసు, మైనారిటీ నాయకులు షరీఫ్,టిడిపి సీనియర్ నాయకులు జొన్నపల్లి సూర్యారావు,మందపల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్ డే




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 15 :** వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. . పిల్లలకు రోల్ ప్లే , క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు, ఈ వేడుకల్లో పి. స్కూలు ఎస్.ఎం.సి. చైర్మన్ త్రిమూర్తులు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరాం, జూనియర్ కాలేజీ ఇంచార్జ్ ఫణి కుమార్ ముగ్గురు ఒకేషనల్ ట్రైనర్స్ స్టీఫెన్ (ఎలక్ట్రానిక్స్), తేజస్విని, వివేక్ (ఆటోమోటివ్) వారి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నైపుణ్యాలను అందిపుచ్చుకునే దిశగా పిల్లలకు సూచనలు చేశారు. అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు ప్రధానం చేశారు.

## 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి



**ఎటపాక ,పెన్ పవర్, జూలై15 :** అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని బుట్టాయిగూడెం 33/11 కెవి సబ్ స్టేషన్లో రంప చోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియల్ మంగళవారం పత్రికా ప్రకటన చేశారు, ఎటపాక మండల పరిధిలోని ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు బుట్టాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని తోటపల్లి ,విఆర్ పేట విద్యుత్ బ్రేకర్ల మరమ్మత్తుల నిమిత్తం రెండు బ్రేకర్ల పరిధిలోని ఉన్నటువంటి తోటపల్లి, గన్నవరం, కాపవరం, నందిగామ, మురుమూరు, ఇస్పాపురం, కుసుమనపల్లి, బుట్టాయిగూడెం, కృష్ణవరం, గోమ్ము కొత్తగూడెం, చలంపాలెం, చోడవరం 12 గ్రామాలకు బుధవారం అనగా 16. 07. 2025 నా కరెంటు అంతరాయం ఏర్పడుతుందని అందుకుగాను వినియోగదారులు చింతించకుండా విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. గాబ్రియల్ కోరడమైనది.

## వీడియో జర్నలిస్టు సుమన్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ అండ

### ఆర్థిక సహాయంతో పరామర్శించిన జర్నలిస్టు సంఘ నాయకులు



**కాకినాడ, పెన్ పవర్,జూలై 15 :** సీనియర్ వీడియో జర్నలిస్టు మల్లాడి సుమన్ ఇటీవల తీవ్రమైన కాలు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ప్రస్తుతం కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే ఒక సర్జరీ విజయవంతంగా పూర్తవ్వగా, మరో సర్జరీ కొన్ని రోజుల్లో జరగనుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.సుమన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు వాతాడ నవీన్ రాజ్, కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సుమన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు.జర్నలిస్టు లందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నవీన్ రాజ్ సూచించారు. చురుకైన పాత్రికేయుడిగా కొనసాగుతున్న సుమన్, ప్రస్తుతం పూర్తిగా మంచానికి పరిమితమవ్వడంతో కుటుంబానికి పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కష్టకాలంలో ఫెడరేషన్ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు దుళ్ల శ్రీధర్, సత్య, పుర్రె త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. సుమన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సంఘం తరఫున సాహాయం కొనసాగించనున్నారు.

## బీసీల ఐక్యతకు నాంది పలికే బీసీ ఆత్మీయ సమ్మేళనం

### - మట్టా వీరబాబు గౌడ పిలుపు



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15 :** కొత్తపేట నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 17వ తేదీన గురువారం నిర్వహించనున్న బీసీ ఆత్మీయ సమావేశానికి బీసీ సమాజం సమష్టిగా పాల్గొనాలని రాష్ట్ర కోఆర్డినేటర్ మట్టా వీరబాబు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశం పార్టీలకు అతీతంగా బీసీల ఐక్యతను ప్రతిబింబించేందుకు ఒక వేదికగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాలకు చెందిన బీసీ సోదరులకు పిలుపు ఇస్తూ ఆయన మాట్లాడుతూ, “ఇది కేవలం ఒక సమావేశం కాదు, మన హక్కుల సాధన కోసం తీసుకునే మైలురాయి. బీసీలంతా ఒక్క తాటిపైకి వచ్చి సామూహికంగా ఆత్మీయతతో చర్చించుకోవాల్సిన సమయం ఇది” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ హాజరవుతారని మట్టా వీరబాబు గౌడ వెల్లడించారు. బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం దక్కేలా, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ సాధించేందుకు ఈ సమావేశం చర్చా వేదికగా నిలవనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడేల నాగేంద్ర గౌడ, బెజవాడ సతీష్, బుడంపత్తి ప్రసాద్, అయినం నాగరాజు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, వేముల శ్రీనివాసు, చిటికెన సత్యనారాయణ, పితాని పండు, తదితర బీసీ నేతలు పాల్గొన్నారు. బీసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా, ఐక్యతతో ముందుకు రావాలని నేతలు ఆకాంక్షించారు.



## రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు

### - రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటన



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 15 :** రాష్ట్రంలో రెండు మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి నారాయణ ప్రకటన చేశారు. మంగళవారం పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో 21 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. కొన్ని మున్సిపాలిటీలో కోర్టు కేసులు ఉన్నాయని, వాటిని నెల రోజుల్లో పరిష్కరించు కునేలా చర్యలు తీసుకుం టునామని చెప్పారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. విలీన గ్రామాలు లేకుండానే మున్సిపల్ ఎన్నికలకు వెళతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం,తణుకు, భీమవరం, పాలకొల్లు మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని వివరించారు.

తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో పేదలకు పట్టాలిస్తామని తెలిపారు . ముందు స్థల వర్గీకరణ పూర్తి కావాలని, ఈ ప్రక్రియ పూర్తి చేసి ఇళ్ల స్థలా లు ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని అధికారులను కూడా ఆదేశించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. తాడేపల్లిగూడెం మున్సిపాలి టీలో మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటునామని, 120 అడుగుల రోడ్డు 80 అడుగులకు కుదించిన సంఘటనలపై నివేదిక తీసుకున్నామని, దీనిపై టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఉన్నతాధికారులకు కూడా వివరాలు పంపామని చెప్పారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ పూర్తి చేసామని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తణుకులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని తాడేపల్లిగూడెంలో దీనికి భిన్నంగా లబ్ధిదారుల పేరు మీద కాకుండా టిడిఆర్ బాండ్లు ఇతరుల పేరు మీదుగా ఇచ్చారని అధికారులు ఎలా చేశారనేది సమస్యగా ఉందని, అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడ్కో గృహాల నిర్మాణం తిరిగి ప్రారంభించాం అని త్వరలోనే లబ్ధిదారులకు వాటిని అప్పగిస్తామని మంత్రి చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇల్లు ఇవ్వకుండా ఇచ్చినట్టుగా బ్యాంకు నుంచి రుణాలు చూపి ఇబ్బందులకు గురి చేశారని దీనిపై కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు నష్టం జరగకుండా బ్యాంకులకు రూ.140 కోట్లు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఇల్లు పూర్తి చేయాలంటే ఏడువేల కోట్ల రూపాయలు అవుసరం అవుతాయని,కేంద్రం 4500 కోట్లు రిలీజ్ చేయడానికి సిద్ధంగా ఉందని వివరించారు.అయితే మిగిలిన 2500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పరిస్థితుల్లో రాష్ట్ర ఖజానా లేదని తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 19వ వార్డులో పర్యటించిన మంత్రి ఒక మేజర్ డ్రైన్ నిర్మాణానికి మరో నాలుగు రోడ్లు ఏర్పాటుకు రెండు కోట్ల 85 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. కార్మిక బోర్డు చైర్మన్ టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజషన్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి ఎల్ అగ్రహారంలో నిర్మించిన టిట్కో ఇళ్ళను పరిశీలించారు.

## చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు సాధ్యం

### - గ్రామ సర్పంచ్ సంగన



**సీతానగరం, పెన్ పవర్, జూలై 15 :** ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని సింగవరం గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య అన్నారు, మంగళవారం తమ గ్రామంలో సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమం ఇంటింటికి తిరిగిప్రభుత్వం ఇచ్చిన పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేస్తూ అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ముందుకు సాగారు, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందించడంతో పాటు రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి మరోసారి అధికారం అందించాలని అన్నారు,

## అర్హుల పేదలకు సంక్షేమం అందించడమే కూటమి లక్ష్యం : మంత్రి సుభాష్

### సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం



**రామచంద్రపురం, పెన్ పవర్,జూలై 15 :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. మంగళ వారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురంలోని 12, 13, 14వ వార్డుల్లో మంత్రి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతుందని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం అధిగమించడానికి నిబద్ధతతో పని చేస్తోందన్నారు.

ఆర్థిక లోటుపాట్లను సమర్థంగా అధిగమిస్తూ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం విజయవంత మవుతుందని తెలిపారు.ప్రతి గ్రామం, పట్టణ అభివృద్దే లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోందని పేర్కొన్న మంత్రి, కార్యకర్తలతో కలిసి ప్రజల మద్దతు పొందేందుకు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నామని తెలిపారు. ప్రజలు సానుకూలంగా స్పందించడాన్ని ఆయన సంతృప్తిగా గుర్తించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ క్లస్టర్ ఇన్‌చార్జులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేటి కాలంలో మానవత్వం సచ్చిపోలేదు

సింధు అప్పల రెడ్డి, మధుసూదన సాయి కార్డియాలజీ రీసెర్చ్ సెంటర్



**కడప పెన్ పవర్ జూలై 15 :** ఈ దార్లో నిన్న యాభై రూపాయల నోటు పారేసుకున్నాను, నాకు కళ్లు సరిగా కనబడవు, మీకు దొరికితే దయచేసి ఈ చిరునామాకు తెచ్చి ఇవ్వగలరు, దయచేసి ఈ సాయం చెయ్యండి’... ఇంటికి వెళ్తుంటే దార్లో ఓ స్తంభానికి అతికించిన కాగితం మీద ఈ మాటలు కనిపించాయి, నాకెందుకో ఆ చిరునామాకు వెళ్లాలనిపించింది, అదో చిన్న పూరిపాక. దగ్గరికి వెళ్లి పిలిస్తే ఓ వృద్ధురాలు వచ్చింది, చూపు ఆనట్లేదు, చేతికర్రతో తడుముకుంటూ నడుస్తోంది. “ఏమీ లేదమ్మా! నువ్వు పోగొట్టుకున్న యాభై రూపాయల నోటు నాకు దొరికింది ఇచ్చి పోదామని వచ్చాను” అన్నాను. ఆమె ఏడుస్తోంది. “బాబూ! ఇప్పటికిలా దాదాపు యాభై అరవై మంది వచ్చారు... ఒక్కొక్కరూ ఒక్కో యాభై రూపాయల నోటు ఇస్తున్నారు. నాకు చదవడం, రాయడం రాదు,ఆ కాగితం ఎవరు రాశారో తెలియదు” అంది...“పోన్లేమ్మా... తీసుకో!” అంటూ నోటును ఆమె చేతిలో పెట్టాను..బాబూ! నా ఇబ్బందులు చూసి ఎవరో మహానుభావుడు అలా రాసిపెట్టి ఉంటాడు, వెళ్లేటప్పుడు అది కాస్త చించెయ్యి నాయినా!” అంది...

‘ఎవరు రాశారో కానీ, దార్లో వెళ్తున్న వాళ్లలో ఎవరో ఒకరు ఆ కాగితాన్ని చూస్తారు... చూసిన వాళ్లలో కొంతమందైనా ఆమెకు సాయపడతారు, నేనా కాగితాన్ని చించేస్తే...? తన దగ్గరికి వచ్చిన వాళ్లందరికీ ఆమె ఇలాగే చెప్పి ఉంటుంది. ఒక్కరూ చించెయ్యలేదు, మరి నేనెందుకు చించాలి? ఆమెకు అందుతున్న సాయాన్ని ఎందుకు అడ్డుకోవాలి?’ ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు. ఇంతలో ఒకాయన చేతిలో చిన్నకాగితం పట్టుకుని ఎదురుపడ్డాడు. ‘సార్... ఈ చిరునామా చెప్పగలరా? పాపం ఎవరో డబ్బులు పోగొట్టుకున్నారట, నాకు దొరికాయి, ఇచ్చేద్దామని అడుగుతున్నాను” అన్నాడు. అది ఆ పెద్దావిడ చిరునామానే, అవును... మానవత్వం ఇంకా చచ్చిపోలేదు, ఆ కాగితాన్ని ఎవరూ చింపరు కూడా....మై డియర్ మాస్టర్స్ ఎవరికైనా సాయం చేయాలనుకుంటే ఎన్నో మార్గాలు! స్పందించే హృదయాలెప్పుడూ స్ఫూర్తిదీపాలే...మీలో కూడా ఇలాంటి భావం రావాలని ఆశిస్తూ...

**ఇట్లు...అజ్ఞాత వ్యక్తి ...**

## కరెంటు పోలుకు చుట్టుకున్న ఆకు తీగలు తొలగించండి



**ఎటపాక, పెన్ పవర్,జూలై 15 :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని చోడవరం గ్రామంలో ఉన్నటువంటి నాగరాజు దాబా హెూటల్ ఎదురుగా జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న కరెంటు పోల్ కు ఆకు తీగలు చుట్టుకుని ఉండటంతో అది గమనించిన ఆయుర్వేదిక్ డాక్టర్ జమాల్ ఖాన్ ఈ తీగలను వెంటనే తొలగించాలని, లేనియెడల అక్కడకు ఎవరైనా వ్యక్తులుగానీ, పశువులు, మేకలు, మూగజీవాలు వచ్చి ఆకు తీగలను తినడం గాని ముట్టుకోవటం గాని జరిగితే పెద్ద ప్రమాదమే వాటిల్లే అవకాశం ఉందని అందుకు వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు స్తంభానికి చుట్టుకుని ఉన్న ఆకు తీగను తొలగించాలని కోరారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన పూర్వ విద్యార్థి అభిరామ్‌కు ఘన సన్మానం

### - సన్మానించిన విజయ సాధన హైస్కూల్ కరస్పాండెంట్ డి.రజిని



**కూనవరం,పెన్ పవర్,జూలై 15 :** విజయ సాధన హై స్కూల్ నందు 2022-23 సం లో పదవ తరగతి విద్యను అభ్యసించిన కారం అభిరామ్ విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ డి రజిని సత్కరించారు.అభిరామ్ ఇంటర్ లో 977 మార్కులు సాధించి ఐఐటి మరియు మణిపూర్ లో నీట్‌లో సీటు సాధించిన పూర్వ విద్యార్థిని స్కూల్ యాజమాన్యం మరియు సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ డి రజిని మాట్లాడుతూ అభిరామ్‌ని ప్రతి విద్యార్థి,విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు,పుట్టి పెరిగిన ఊరికి పేరు తీసుకొని రావాలని అన్నారు.తమ విద్యార్థి అయినా అభిరామ్ ఉన్నత మైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి తల్లిదండ్రులను సన్మానించారు.

# 8 ఏళ్ళ తర్వాత రీ ఎంట్రీ: నాలుగో టెస్టుకు ఇంగ్లాండ్ స్క్వాడ్ ప్రకటన





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో జరగబోయే నాలుగో టెస్ట్ కోసం ఇంగ్లాండ్ తమ స్క్వాడ్ ను ప్రకటించింది. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (%జుజదీ%) మంగళవారం (జూలై 15) 14 మంది ఆటగాళ్లతో కూడిన ఇంగ్లాండ్ జట్టును ప్రకటించింది. గాయంతో సిరీస్ కు దూరమైన ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో మరో ఆఫ్ స్పిన్నర్ లియామ్ డాసన్‌ను జట్టులోకి చేర్చుకుంది. ఈ ఒక్క మార్పు మినహా కొత్త ఆటగాళ్లెవరూ స్క్వాడ్ లోకి రాలేదు. ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లో జరుగుతుంది. ప్రస్తుతం 3 టెస్ట్ మ్యాచ్ లు జరగగా ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది.

**8 ఏళ్ళ తర్వాత డాసన్**

డాసన్ 8 ఏళ్ళ తర్వాత ఇంగ్లాండ్ టెస్ట్ స్క్వాడ్ లో స్థానం సంపాదించాడు. బషీర్ లేకపోవడంతో నాలుగో టెస్టుకు డాసన్ కు ఏకైక స్పిన్నర్ గా ప్లేయింగ్ 11 లో చోటు దక్కే అవకాశం ఉంది. చివరిసారిగా జూలై 2017లో ఇంగ్లాండ్ తరపున డాసన్ టెస్ట్ క్రికెట్ ఆడాడు. 35 ఏళ్ల ఈ ఆఫ్ స్పిన్నర్ కొన్నేళ్లుగా హాంప్‌షైర్ తరపున నిలకడగా ఆడుతున్నాడు. 2023, 2024లో PCA ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు స్క్వాడ్ నుంచి పేసర్లు సామ్ కుక్, జామీ ఓవర్టన్‌లను విడుదల చేసింది. వీరిద్దరూ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడటానికి అనుమతిని ఇచ్చారు.

**బషీర్ కు గాయం:**

ఇంగ్లాండ్ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయంతో టెస్ట్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. టీమిండియాతో జరిగిన మూడో టెస్టులో భాగంగా మూడో రోజు బషీర్ ఎడమ చేతి చిటికెన వేలికి గాయం అయింది. స్కాన్ చేస్తే పగుళ్లు ఉండడంతో సర్జరీ అవసరమని డాక్టర్లు సూచించారు. దీంతో నాలుగు, ఐదు టెస్టులకు ఈ ఇంగ్లాండ్ ప్రధాన స్పిన్న దూరమయ్యాడు. టీమిండియా తొలి ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో బషీర్ వేసిన బంతిని జడేజా బలంగా బాదాడు. బంతిని ఆపే క్రమంలో బషీర్ చేతికి బలంగా తగిలింది. దీంతో బౌలింగ్ చేయలేక ఓవర్ మధ్యలోనే బషీర్ గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. మిగిలిన ఓవర్ రూట్ పూర్తి చేశాడు.

విరిగిన వేలు తోనే బషీర్ నాలుగో రోజు బ్యాటింగ్ కు వచ్చాడు. ఐదో రోజు కూడా జట్టు కోసం గాయంతోనే బౌలింగ్ చేశాడు. ఐదో రోజు తీవ్ర ఉత్కంఠ సమయంలో సిరాజ్ వికెట్ తీసి బషీర్ ఇంగ్లాండ్ కు చివరి వికెట్ అందించాడు. దీంతో ఇంగ్లాండ్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది.

**టీమిండియాతో 4వ టెస్ట్ కు ఇంగ్లాండ్ స్క్వాడ్:**

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, జాక్ క్రాలే, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓల్లీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

# ఒక్క హాఫ్ సెంచరీ లేదు.. 516 పరుగులు.. 40 వికెట్లు: ఆసీస్, విండీస్ టెస్టులో 5 మిరాకిల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** జమైకాలో కింగ్ స్టన్ వేదికగా సబీనా పార్క్ లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ లో బౌలర్లు వికెట్ల వర్షం కురిపించారు. బౌలర్లు విజృంభించి రెండున్నర రోజుల్లోనే 40 వికెట్లు కూల్చారు. ఈ టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్లు అత్యద్భుతంగా చెలరేగడంతో వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్ లో కేవలం 27 పరుగులకే ఆలౌట్ అయింది. ఆద్యంతం బౌలర్లు ఆధిపత్యం చూపించిన ఈ మ్యాచ్ లో వెస్టిండీస్ పై ఆస్ట్రేలియా 176 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ చెప్పుకోవాలంటే చాలానే విశేషాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం..

**పదేళ్ల తర్వాత తొలిసారి:**

ఈ టెస్ట్ మ్యాచ్ లో నాలుగు ఇన్నింగ్స్ ల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు కాలేదు. స్టీవ్ స్మిత్ చేసిన 48 పరుగులు అత్యధికం. 2015 తర్వాత ఇలా జరగడం ఐదు తొలిసారి. నాగ్ పూర్ వేదికగా ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఈ టెస్టులో ఒక్క హాఫ్ సెంచరీ కూడా ఎవరు కొట్టలేకపోయారు. టీమిండియా ఓపెనర్ మురళీ విజయ్ చేసిన 40 పరుగులు అత్యధికం. ఈ మ్యాచ్ లో భారత్ 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

**విండీస్ టెస్ట్ చరిత్రలో అత్యల్ప స్కోర్:**

ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో వెస్టిండీస్ కేవలం 27 పరుగులే ఆలౌట్ అయింది. స్టార్క్ ఆరు వికెట్లతో చెలరేగడంతో పాటు బోలాండ్ హ్యాట్రిక్ తీయడంతో 205 పరుగుల లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ కేవలం 27 పరుగులకే ఆలౌటై తమ టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోర్ నమోదు చేసింది. ఓవరాల్ గా టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోర్.

**బోలాండ్ హ్యాట్రిక్:**

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ తో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్ లో ఈ ఆసీస్ పేసర్ ఈ ఘనతను అందుకున్నాడు. దీంతో పింక్ బాల్ టెస్ట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి బౌలర్ గా చరిత్ర సృష్టించాడు. జస్టిన్ గ్రీవ్స్, షమర్ జోసెఫ్, జోమెల్ వారికన్‌లను వరుస బంతుల్లో బోలాండ్ ఔట్ చేశాడు. దీంతో 2010 తర్వాత టెస్ట్ ఫార్మాట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి ఆసీస్ బౌలర్ గా నిలిచాడు.

**స్టార్క్ వరల్డ్ రికార్డ్:**

ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో స్టార్క్ తన బౌలింగ్ తో విజృంభించి కేవలం 15 బంతుల్లోనే ఐదు వికెట్లు పడగొట్టి ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఫాస్టెస్ట్ 5 వికెట్లు పడగొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. అంతకముందు టెస్టుల్లో ఈ రికార్డ్ ఎర్నీ టోషాక్ (ఆస్ట్రేలియా), స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లాండ్) , స్కాట్ బోలాండ్ (ఆస్ట్రేలియా) పేరిట ఉంది. ఈ ముగ్గురు 19 బంతుల్లో 5 వికెట్లను పడగొట్టారు. తాజాగా స్టార్క్ ఈ రికార్డ్ ను అధిగమించి టాప్ కు చేరాడు.

ఓవరాల్ గా 7.3 ఓవర్లలో కేవలం 9 పరుగులే ఇచ్చిన స్టార్క్.. ఆరు వికెట్లు పడగొట్టాడు. స్టార్క్ తన తొలి ఓవర్ లోనే మూడు వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో పాటు ఈ మ్యాచ్ లో స్టార్క్ టెస్ట్ క్రికెట్ లో 400 వికెట్లను పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన రెండో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ గా ఓవరాల్ గా నాలుగో ఆసీస్ బౌలర్ గా నిలిచాడు. స్టార్క్ ఆరు వికెట్లతో విజృంభించడంతో విండీస్ జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది.

**ఏడుగురు డకౌట్స్:**

రెండో ఇన్నింగ్స్ లో ఏకంగా ఏడుగురు వెస్టిండీస్ క్రికెటర్లు డకౌట్ కావడం షాకింగ్ కు గురి చేస్తుంది. 148 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్ లో ఏడుగురు డకౌట్ కావడం ఇదే తొలిసారి. అంతకముందు అత్యధికంగా ఆరుగురు డకౌటైన రికార్డును విండీస్ చెత్త రికార్డ్ తమ ఖాతాలో వేసుకుంది. జాన్ కాంప్‌బెల్, కెవెలాన్ ఆండర్సన్, బ్రెండన్ కింగ్, రోస్టన్ చేజ్, షెమర్ జోసెఫ్, జోమెల్ వారికన్, జేడెన్ సీల్స్ ఈ మ్యాచ్ లో డకౌటయ్యారు.

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 225 పరుగులకు ఆలౌట్ అయింది. స్మిత్ 48 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. షామర్ జోసెఫ్ 4 వికెట్లతో చెలరేగాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 143 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియాకు 82 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 121 పరుగులకే ఆలౌట్ అయింది. 205 పరుగుల లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ 27 పరుగులకు ఆలౌట్ అయింది. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి.

# టాలీవుడ్ లో దీపిక-ప్రియాంక మధ్య పోటీ!

హీరోయిన్ల మధ్య పోటీ అన్నది సహజం. ఒకరి అవకాశాలు మరొకరు తన్నుకుపోతుంటారు. కొన్ని అవకాశాల కోసం టార్గెట్ గా బిహైండ్ రాజకీయం చేస్తుంటారు. ఈ రకమైన పోటీ స్టార్ హీరోయిన్ల మధ్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. భవిష్యత్ లో ఇలాంటి పోటీ దీపికా పదుకొణె-ప్రియాంక చోప్రా మధ్య కూడా తప్పేలా లేదు. అందులోనూ ఇద్దరు టాలీవుడ్ లో ఈ పోటీ పడే అవకాశం కనిపిస్తుంది. 'కల్కి' తో దీపికా పదుకొణె టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా హిట్ తో పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. బాలీవుడ్ సినిమా కంటే ఓ తెలుగు సినిమాతోనే దేశి విదేశాల్లో ఎక్కువ గుర్తింపు దక్కింది. ఈ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్రం కోసం హీరోయిన్ గా ఎంపిక చేసారు. అమ్మడు ఇందులో బన్నీ సరసన నటిస్తుం ది. ఈ సినిమా తర్వాత దీపిక పాన్ ఇండియా రేంజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది.





కృతి శెట్టి యొక్క కూల్ క్లిక్ హృదయాలను ద్రవింపజేస్తుంది

అటు గ్లోబల్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న ప్రియాంక చోప్రా బాలీవుడ్ సినిమాలను సైతం కాదని టాలీవుడ్ లో ఎస్ఎస్ ఎంబీ 29 తో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఎంతో మంది భామల పేర్లను పరిశీలించిన అనంతరం ప్రియాంక లాక్ అయింది. ఈ ప్రాజెక్ట్ ను ఆమె అంగీకరించడం కూడా గొప్ప విషయమే. హాలీవుడ్ లో ప్రియాంక చోప్రా ఎంతో బిజీ నటి. వందల కోట్ల రూపాయలు పారితోషికంగా తీసుకుంటుంది. పీసీతో సినిమా చేయాలని బాలీవుడ్ కూడా ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. వాళ్లను సైతం కాదని పీసీ రాజమౌళి సినిమాకు ఒకే చెప్పడం మరో పెద్ద విషయం. ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా ఈ చిత్రం రూపొందుతుంది.

అటు బన్నీ చిత్రం పై కూడా క్రేజ్ అలాగే ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధించిన తర్వాత ఇండియాలో హీరోయిన్ల ఇద్దరి క్రేజ్ రెట్టింపు అవుతుంది. అటుపై వాళ్లు కమిట్ అయ్యే కొత్త ప్రాజెక్ట్ లు అంతే ఆసక్తికరంగా ఉంటాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో ఇద్దరి మధ్య తగ్గాఫ్ వార్ నడిచే అవకాశం ఉంటుంది. అవకాశాల పరంగా భామలిద్దరు పోటీ పడినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఒకసారి పోటీ మొదలైందంటే? దాని పర్యవసానాలు ఎలా ఉంటాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. నువ్వా? నేనా? అన్న రేంజ్ వార్ తప్పదు.



శ్రియా శరణ్ పీచ్ ఇట్ అప్ యొక్క పాస్టెల్ డ్రీమ్ లుక్‌లో మెరిసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com